
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY



నల్లగొండ

5 మంగళవారం 12 ఆగస్టు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	65,800	76,252
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.38 (4.04)	5070.56	4375.6
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.963 (42.6707)	76,373	1,12,536

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

నులి పురుగుల నివారణ అందరి బాధ్యత

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండటౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణ అందరి బాధ్యత అని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాకేంద్రంలోని దేవరకొండ రోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉంటే ఎదుగుదల ఆగి, రక్తహీనతతో పాటు, కడుపునొప్పి బాధపడి మానసిక వైకల్యానికి గురవుతారన్నారు. జిల్లాలో 19 ఏళ్లలోపు పిల్లలందరికీ నూటికి నూరుశాతం అల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. గతంలో ప్రభుత్వం సంవత్సరానికి రెండుసార్లు ఈ మాత్రలను వేసేదని, ఇప్పుడు సంవత్సరంలో ఒకసారి మాత్రమే వేస్తున్నందున, తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వే ణుగోపాల్, డీఈవో భిక్షపతి పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలను, తప్పనిసరిగా తనిఖీ చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత మండల ప్రత్యేక అధికారులపై ఉందన్నారు. కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన హర్ ఘర్ తిరంగా వాల్‌పోస్టర్‌ను జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, ఆర్డీవో లురమణారెడ్డి, శ్రీదేవి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

అసమ్మతి గళంతో..

కాంగ్రెస్‌లో దుమారం



- మంత్రి పదవిపై అధిష్ఠానం హామీ ఇచ్చిందన్న డిప్యూటీ సీఎం
- రాజగోపాల్‌రెడ్డిని విమర్శిస్తూ తెరమీదకు చల్లమల్ల కృష్ణారెడ్డి
- చల్లమల్లకు కాంగ్రెస్‌కు సంబంధం లేదని ప్రకటించిన యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు
- ఆసక్తికరంగా మారుతోన్న రాజకీయం

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అసమ్మతి గళం కాంగ్రెస్‌లో దుమారం రేపుతోంది. రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవి విషయంలో రోజుకో ఘటన తెరమీదకు వస్తోంది. తాజాగా ఈ నెల 10వ తేదీన ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క రాజగోపాల్‌రెడ్డి వాదనకు బలం చేకూర్చేలా వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వాస్తవాలు చెప్పినందుకు ఆయనకు ధన్యవాదాలు అంటూ రాజగోపాల్‌రెడ్డి ఎక్స్ (ట్విటర్)లో ట్వీట్ చేయడంతో కాంగ్రెస్‌లో, రాజకీయపార్టీల్లో చర్చ మొదలైంది. మరోవైపు సోమవారం చల్లమల్ల కృష్ణారెడ్డి రాజగోపాల్‌రెడ్డిని విమర్శిస్తూ నల్లగొండ జిల్లా మర్రిగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడితే, ఆయనకు కాంగ్రెస్‌తో సంబంధమే లేదని యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఖండించగా, సంస్థాన్‌నారాయణపురం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చల్లమల్లపై ఫైర్ అయ్యారు.

మంత్రి పదవి హామీ వాస్తవమే..

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో అధిష్ఠా నవర్గం ఆయనకు రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా అవకాశం కల్పిస్తామని మాట ఇచ్చిన మా ట వాస్తవమని, ఆరోజు తాను ఆ సమావేశంలో ఉన్నానని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీన ఒక టీవీఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని బహిరంగపరిచారు. కేబినెట్ కూర్పు సమీకరణాల్లో ఆయనకు అవకాశం కల్పించలేకపోయామని భట్టి వివరించారు. భట్టి వ్యాఖ్యల నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డి తాజాగా సోమవారం ఎక్స్‌వేదికగా భట్టి వ్యాఖ్యల కు ధన్యవాదాలు తెలుపుతూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తను ట్యాగ్ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనకు మంత్రి పదవి ఇస్తామన్న హామీని అమలు చేయకుం డా రాష్ట్ర ముఖ్యనేతలు అడ్డుకుంటూ, అవమానిస్తున్న వాస్తవాన్ని మీడియా ద్వారా ప్రజలకు వివరించినందుకు డిప్యూటీ సీఎంకు ధన్యవాదాలని పేర్కొన్నారు.



మంత్రి పదవి ముఖ్యం కాదని..

రాజగోపాల్‌రెడ్డి మరోసారి తనకు మంత్రి పదవి ముఖ్యంకాదని, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, అవినీతిరహిత పాలన అందించాలని కోరారు. తెలంగాణ సమాజ ఆకాంక్షలు నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి రాకుండా రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు అడ్డుకుంటూ, అవమానిస్తున్నారని ఈ సందర్భంగా రాజగోపాల్ ప్రస్తావించారు. ఇప్పటికే ఆయన సీఎం రేవంత్‌రెడ్డి సోషల్ మీడియా, డిజిటల్ మీడియాపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పోస్ట్ చేయడంతో పాటుగా, గతంలో చౌటుప్పల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకునేలా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నేతలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతూ లేఖరాయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా తనకంటే జూనియర్లకు, పార్టీలో కొత్తగా చేరిన వారికి మంత్రిపదవులిస్తున్నారంటూ విమర్శలు సైతం గుప్పించారు.

కాంగ్రెస్ నేతలపై తరుచూ విమర్శలు

ఇటీవల తరచూ ఆయన సీఎంపైనా, కాంగ్రెస్ నేతలపైనా నేరుగా విమర్శలకు దిగుతున్నారు. తనకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంతోపాటు, పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా రాజగోపాల్‌రెడ్డి గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా డిప్యూటీ సీఎం సైతం రాజగోపాల్ వాదనను బలపరిచేలా వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్‌లో రాజగోపాల్ వాదనకు బలం చేకూరినట్లైందని ఆయన వర్గీయులు చెబుతున్నారు. రాజగోపాల్ రెడ్డి సోదరుడు మంత్రి వెంకటరెడ్డి మాత్రం ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి విషయమై విలేకరులు ప్రశ్నించగా, అది తన పరిధిలోని అంశం కాదని, ఆవిషయమై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని.

- మిగతా 7వ పేజీలో...



7

ఆర్టీసీకి రాఖీ ధమాకా

- మూడు రోజుల్లో రూ.6.56కోట్ల ఆదాయం

అన్నాచెల్లెళ్ల పండుగ రాఖీ.. ఆర్టీసీకి కలిసొచ్చింది. అత్తగారింటి వద్ద ఉన్న ఆడపడుచులు తల్లిగారింటికి రావడంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి. దీంతో ప్రత్యేక సర్వీసులను సైతం నడిపిన ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. మూడు రోజుల్లో రూ.6.56 కోట్లు వచ్చింది. ఇది ఆర్టీసీ చరిత్రలోనే ఓ రికార్డు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

గోదాములు ఖాళీల్లేవ్



మిర్యాలగూడ సమీపంలో ఓ రైస్‌మిల్ వద్ద ధాన్యం నిల్వలు

- సీఎంఆర్ బియ్యం నిల్వ చేసేందుకు చోటు కరువు
- ఎఫ్‌సీఐకి కేటాయించిన 2.46 లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం గోదాముల్లోనే నిల్వ
- ఎఫ్‌సీఐ నుంచి ఆర్డర్లు, రైల్వే నుంచి వ్యాగన్ల కేటాయింపుల్లో జాప్యం

నల్లగొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మిల్లుల్లో బియ్యం నిల్వలు పేరుకపోవడంతో మిల్లింగ్ ఆపాల్సి వస్తోంది. గోదాములు, మిల్లుల్లో బియ్యం నిల్వలు సామర్థ్యానికి మించి నిండిపోయాయి. ఎఫ్‌సీఐకి లెవీ కింద కేటాయించిన బియ్యాన్ని తరలించేందుకు అవసరమైన రైల్వే వ్యాగన్లు అందుబాటులో లేకపోవడంతో ఎక్కడి బియ్యం అక్కడే ఆగిపోయాయి. దీంతో మిల్లుల్లో బియ్యం మరాడించలేక సామర్థ్యాన్ని తగ్గించుకోవడం, లేదంటే మిల్లింగ్ ఆపేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎఫ్‌సీఐతో సమన్వయం చేసుకొని బియ్యం నిల్వలు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, లేదంటే బియ్యం నిల్వలకు ప్రత్యామ్నాయాన్నైనా వెతకాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు నల్లగొండ జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం నాయకులు కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు తమ సమస్యలు విన్నవించడంతో గోదాములు నిండిన విషయం చర్చకు వచ్చింది.

ఎఫ్‌సీఐ నుంచి ఆర్డర్లు, రైల్వే నుంచి ర్యాక్స్..

జిల్లాలో ఉన్న గోదాములలో ఇప్పటికే ధాన్యం పూర్తిగా నిండిపోవడంతో మిల్లుల నుంచి వచ్చే సీఎంఆర్ కోటా బియ్యం నిల్వ చేసేందుకు గోదాములు అందుబాటులో లేవు. జిల్లాలో గత నాలుగైదు సీజన్లుగా యాసంగిలోనూ దొడ్డురకం ధాన్యం భారీగా దిగుబడి వస్తుండడం, ఆ ధాన్యమంతా ప్రభుత్వమే కొనుగోలు చేసి సీఎంఆర్ ద్వారా బియ్యంగా మార్చి తిరిగి ఎఫ్‌సీఐకి లెవీ కింద కేటాయిస్తుంది. ఎఫ్‌సీఐ నుంచి ఆర్డర్లు తీసుకోవడం, తీసుకున్న ఆర్డర్ ప్రకారం బియ్యాన్ని పంపేందుకు అవసరమైన రైల్వే ర్యాకులు తెప్పించడంలో సివిల్ సప్లయిస్ సంస్థ, కేంద్ర ఎఫ్‌సీఐ సంస్థల మధ్య సమన్వయలోపంతో జిల్లాలో బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. అందుబాటులో ఉన్నసమాచారం మేరకు జిల్లాలో 31 గోదాముల్లో 5,35,235 మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యముండగా, వాటిల్లో దాదాపు వందశాతం సామర్థ్యం మేర నిల్వలు పేరుకుపోయాయని తెలుస్తోంది. దీంతో మిల్లులకు ఈ రబీ సీజన్‌లో కేటాయించిన ధాన్యం నుంచి ఉత్పత్తయ్యే బియ్యం తరలించడానికి గోదాముల్లో ఖాళీ లేదు. దీంతో మిల్లుల్లో సైతం ఎక్కడికక్కడ బియ్యం నిల్వలు పేరుకపోవడంతో జిల్లావ్యాప్తంగా పలు రైస్‌మిల్లుల్లో మిల్లింగ్ సామర్థ్యం తగ్గించి పనిచేయిస్తుంటే, మరికొన్ని మిల్లుల్లో మిల్లింగ్‌ను పూర్తిగా నిలిపివేశామని మిల్లర్లు పేర్కొంటున్నారు.

జిల్లాలోని కొనుగోలు కేంద్రాల ద్వారా..

ఈ రబీ సీజన్‌లో జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా 5,79,868 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సీఎంఆర్ నిమిత్తం మిల్లులకు కేటాయించారు. ఇందుకు 3,33,602 మెట్రిక్‌టన్నుల బియ్యం రావాల్సి ఉండగా, ఇందులో 2,62,961 మెట్రిక్‌టన్నుల బియ్యం సిద్ధంగా ఉందని, ఇంకా 70,639 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లుల నుంచి రావాల్సి ఉంది. దీంతో గోదాములు పూర్తి నిల్వ సామర్థ్యానికి...

- మిగతా 8వ పేజీలో...

నేర నియంత్రణకు సిద్ధంగా ఉండాలి

- ఎస్పీ శరత్ చంద్రపవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణలో భాగంగా మహిళా పోలీస్ సిబ్బంది అన్ని విధులు నిర్వర్తించడానికి సిద్ధంగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న మహిళా పోలీస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వారు చేస్తున్న డ్యూటీ, ఎదురయ్యే సమస్యలు, పురుష సిబ్బందితో సమానంగా విధులు నిర్వర్తిస్తే ఎదురయ్యే సమస్యలు, కుటుంబ తరఫున సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 'షీ లీడ్స్-నల్లగొండ బిలీవ్స్' అనే నినాదంతో నూతన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా సిబ్బంది పోలీస్‌స్టేషన్లలో రిసెప్షన్, రికార్డు వర్క్స్, కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రాం, నైట్ పెట్రోలింగ్, పిటిషన్ ఎంక్వయిరీ, కోర్టు డ్యూటీ, బందోబస్త్ డ్యూటీలు పురుషులతో సమానంగా విధులు నిర్వర్తించాలన్నారు. మహిళా సిబ్బందికి సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ రమేష్, ఎస్‌బీ సీఐ రాము, డబ్ల్యూపీఎస్ సీఐ కరుణాకర్, ఆర్ఐ సంతోష్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదుల పరిశీలన

జిల్లాపోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ శరత్ చంద్రపవార్ పరిశీలించారు. వివిధ ప్రాంతాలనుంచి 52 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేయాలన్నారు. పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.


జిల్లాలో కురిసిన వర్షం

నల్లగొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారంరాత్రి పలు మండలాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై, మధ్యాహ్నం, సాయంత్రంవేళ వానపడింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు వర్షం నీటితో జలమయమయ్యాయి. వరి పొలాలు నీట మునిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గుడిపల్లిలో అత్యధికంగా 67.8మి.మీలు, అత్యల్పంగా నల్లగొండ పట్టణంలో 16.3మి.మీల వర్షం కురిసింది.



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో కురుస్తున్న వాన

విద్యార్థుల అభ్యసనంపై దృష్టి సారించాలి



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

- ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు హాజరు నమోదు తప్పనిసరి
- టీచర్లు తప్పనిసరిగా డైరీ రాయాలి
- చిట్యాల మండ ం వట్టిమర్తిలో పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో బొల్లారం భిక్షపతి

చిట్యాల రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను విద్యార్థులు తప్పనిసరిగా అభ్యసించాలని, విద్యార్థుల అభ్యసనంపై ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను సోమవారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు నమోదు పరిశీలించి, దాని గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని నమోదులో ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులందరూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌ను (టచ్ స్ర్కీన్) ఉపయోగించి పాఠ్యాంశాలు బోధించాలని, విద్యార్థుల హాజరుశాతం పెంపుపై, ఉపాధ్యాయుల డైరీ, విద్యార్థుల వర్క్‌బుక్‌ల పరిశీలన, వారి అభ్యసన సామర్థ్యంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, పాఠశాలకు విద్యార్థులు నిత్యం హాజరయ్యేలా కృషిచేయాలని, అంతేకాకుండా హాజరుశాతం కూడా పెరిగే విధంగా చూడాలన్నారు. తరగతి గదుల్లో విద్యార్థుల అభ్యసనాభివృద్ధిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, అభ్యసనా సామర్థ్యం విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. పాఠ్యాంశాల బోధన అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో అభ్యనం చేయించాలని, తద్వారా విద్యార్థులు పాఠ్యాంశాలను అవలీలగా అవగతం చేసుకోవడమే కాకుండా, వారి అభ్యసనా సామర్థ్యం పెరుగుతుందన్నారు. పాఠశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు తప్పనిసరిగా ముఖ గుర్తింపు హాజరును నమోదు చేసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులందరూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌ను వినియోగించి బోధనాభ్యాసన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులందరూ తప్పనసరిగా డైరీని రాయాలని, ఆ డైరీ అందరికీ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం పెట్టాలని, నాణ్యతగా, రుచికంగా, పరిశుభ్రంగా వంటలు చేయాలన్నారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయులు పందిరి రమేష్, సరస్వతి, ఉపాధ్యాయులు యాదయ్య, ఆనంద్, నర్సింహ తదితరులు ఉన్నారు.

వరదొచ్చిందంటే గుండెల్లో దడ

- భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తోన్న మూసీ



వలిగొండ మండలం సంగెం-బొల్లెపల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న మూసీ

వానాకాలం వచ్చిందంటే చాలు మూసీ పరివాహక ప్రాంతాల ప్రజల గుండెల్లో దడ మొదలవుతుంది. హైదరాబాద్‌నగరంతోపాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసిన పక్షంలో... రాత్రికి రాత్రే మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. వరద ఉధృతి పెరిగినప్పడల్లా యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు మండలాలకు రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. ఉదయం లేచి వేరే గ్రామానికి వెళ్దామంటే మూసీ ప్రమాదకరంగా పారుతూ కన్పిస్తుంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

ఎగువన కురిసిన వర్షాలకు మూసీ వాగులు పొంగిపొర్లుతున్నాయి.చౌటుప్పల్ మండలం నేలపట్ల వద్ద ఈనెల 8వ తేదీన ఉధృతంగా ప్రవహి స్తున్న మూసీ కాలువపై నుంచి కారు వెళ్లలేక చిక్కుకుంది. ఈకారులో ఇద్దరు చిన్నారులతోపాటు ఏడుగురు వ్యక్తులు ఉన్నారు. వారు వెంటనే అప్రమత్తమై 100కు డయల్ చేయడంతో పోలీసు లు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకొని తాడు సహాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు. ఈ నెల నాలుగో తేదీన వలిగొండ మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన నలుగురు పశువుల కాపరులు మూసీ వాగులో చిక్కుకున్నారు. వీరు కూడా 100కు డయల్ చేయడంతో వెంటనే రెస్క్యూ టీం సహాయక చర్యలు చేపట్టి..., వీరిని బయటకు తీసుకొచ్చిన విషయం విదితమే.

ప్రమాదకరంగా ప్రయాణం

వ్యవసాయ పనులు చేసేవారితోపాటు పశువుల కాపరులు నిత్యం ప్ర మాదాల బారిన పడుతున్నారు. యాదాద్రి భు వనగిరి జిల్లాలోని బీబీనగర్ మండలం రుద్రవెల్లి-జూలూరు లోలెవల్ బ్రిడ్జి మీదుగా భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్ మండలాలకు వెళ్లే పరిస్థితి ఉండదు. అదేవిధంగా వలిగొండ మండలం సంగెం-బొల్లెపల్లి భీమలింగం కత్వ మీదుగా భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాలకు దారులు మూసుకుపోతాయి. హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లి-జూలూరు బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం లభించడంలేదు. 2016లో ప్రస్తు తం ఉన్న లోలెవల్ బ్రిడ్జి పక్కనుంచి హైలెవల్ బ్రిడ్జిని నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం చర్య లు తీసుకుంది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి అంచనా లు రూపొందించి..., మొదటగా రూ.5.05కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 20మంది రైతు ల వద్ద 2.04ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించడమే కాకుండా, కొన్ని పిల్లర్ల వరకు అసంపూర్తిగా నిర్మాణాలు చేపట్టింది. ఏడు సంవత్సరాలుగా పిల్లర్ల స్థాయిలోనే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వం మరోసారి అదనంగా మరో రూ.10.80కోట్లు మంజూరు చేసింది. అయితే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందకు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూసీ ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

ముఖ్యమంత్రి చొరవతో..

ముఖ్యమంతి ఎనుముల రేవంత్‌రెడ్డి గత సంవత్సరం నవంబరులో వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద చేపట్టిన మూసీ పునరుజ్జీవం పాదయాత్ర చేపట్టారు. స్థానిక ప్రజలు మూసీ కాలుష్యంతో పడుతున్న ఇబ్బందులను, మూసీ ప్రక్షాళన అవశ్యకతను వివరించారు. మూసీ ప్రక్షాళన ఒక సంకల్పంతో చేపట్టామని, ఎవరు అడ్డుపడ్డా చేస్తామని ప్రకటించారు. నూతనంగా ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విన్నవించారు. దీనిపై సీఎం స్పందిస్తూ ఈ ప్రాంతంలో నిర్మించాల్సిన బ్రిడ్జిలపై పూర్తిస్థాయి నివేదికను అందించాలని, వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ఐదు కిలోమీటర్లు వెంబడించి దొంగల పట్టివేత



పోలీసులకు పట్టుబడిన దొంగలు

మద్దిరాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసి బైక్‌పై పారిపోతున్న దొంగలను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మాటేడు గ్రామ సమీపంలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో పుస్తెల తాడును అపహరించారు. ద్విచక్ర వాహనంపై పారిపోతున్న దొంగల గురించి స్థానికులు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన పోలీసులు దంతాలపల్లి మండల పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి పోలీసులు దొంగలను అడ్డగించడంతో తప్పించుకొని సూర్యాపేట జిల్లా వైపు పరారయ్యారు. వెంటనే మద్దిరాల మండల పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అప్రమత్తమై దారికాయడంతో గమనించిన దొంగలు ద్విచక్రవాహనంపై మద్దిరాల మండలకేంద్రం శివారులో నుంచి పోలుమళ్ల గ్రామ వ్యవసాయ భూముల్లోకి పారిపోయారు. మద్దిరాల, పోలుమళ్ల గ్రామాల యువకుల సాయంతో పోలీసులు ఐదు కిలో మీటర్ల మేర వెంబడించి పోలుమళ్ల గ్రామ పరిధిలో పట్టుకున్నారు. పట్టుబడిన దొంగలను మద్దిరాల పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. వారు యూపీకి చెందిన వారమని తెలిపారు. అనంతరం దొంగలను తొర్రూరు పోలీసులకు అప్పగించారు. దొంగలు వాడిన ద్విచక్ర వాహనాన్ని ఖమ్మంలో దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని గూడూరు గ్రామ శివారులో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45ఏళ్ల వయస్సు గల ఉన్న వ్యక్తి మృతదేహంపై బూడిద రంగు చొక్కా, లుంగీ ఉంది. కొద్ది రోజులుగా గూడూరు గ్రామశివారులో భిక్షాటన చేసే వాడని స్థానికులు తెలిపారు. మూడు రోజల క్రితం మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కుళ్లిపోయే దశలో ఉన్న మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. గుర్తించిన వారు సెల్: 8712670189, 8712670151 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

డిండి మండలంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా

డిండి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా డిండి మండలంలో ఇసుక అక్రమ రవాణా అడ్డు, అదుపులేకుండా సాగుతోంది. ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేస్తున్న వ్యాపారులు టిప్పర్లను ఎంచుకొని వ్యాపారం సాగిస్తున్నారు. రాత్రివేళలో సాగిన ఇసుక అక్రమ వ్యాపారం బాహాటంగా పగటిపూట సాగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని డిండి వాగు నుంచి ఇసుక తోడి డిండి మండలకేంద్రానికి రవాణా చేస్తున్నారు. అధికారులు, రెవెన్యూ, పోలీసులు చర్యలు చేపట్టకపోవడంతో ఇసుక తరలించడం వ్యాపారులకు సునాయసమైంది. మునుపెన్నడూ లేని విధంగా పగటిపూటనే టిప్పర్లతో ఇసుక వ్యాపారం సాగడం గమనార్హం. రాత్రివేళలో గుట్టుచప్పుడు కాకుండా ఇసుక వ్యాపారం పగటిపూటనే యథేచ్ఛగా సాగుతోంది. డిండి మండలంలోని వావిల్‌కోల్, డి. నెమలిపూర్, కందుకూరు, గోనబోయినపల్లి, డిండి వాగుతోపాటు దేవరకొండ మండలంలోని తాటికోలు వాగునుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా సాగుతోంది. ట్రాక్టర్‌కు రూ.5వేలు, టిప్పర్ రూ.35వేలకు ఇసుక విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ బాలకృష్ణను వివరణ కోరగా ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శివాలయంలో ఘనంగా గోపూజోత్సవం



గోపూజోత్సవంలో పాల్గొన్న భక్తులు

మేళ్లచెర్వు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మండలకేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభూ శంభు లింగేశ్వరస్వామి దేవస్థానంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, మహాన్యాసరుద్రాభిషేకం, మహాలింగార్చన, సహస్రనామార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా గోపూజోత్సవాన్ని సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఈవో నాగేళ్ల శంభిరెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం 10గంటలకు శివాలయంలో గోపూజను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రేవియేషన్ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, మామిడి గణేష్, కొండారెడ్డి, నరసింహారెడ్డి, అర్చకులు శివ విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయ శర్మ తదితరులు పాల్గొన్నారు.



మేళ్లచెర్వులో బ్రహ్మ కమలం

హిమాలయాల్లో మాత్రమే కనిపించే బ్రహ్మ కమలం సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రంలోని కాంగ్రెస్ నాయకురాలు రంగిశెట్టి కవితసైదయ్య ఇంట్లో కనిపించింది. ఈ మొక్కను ఇంటికి తీసుకొచ్చి పెంచుతున్నట్లు కవిత తెలిపారు. ఈ మొక్క (బ్రహ్మ కమలం) వికసించడంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ అరుదైన బ్రహ్మ మొక్కను చూసేందుకు చుట్టూ పక్కల వారు తరలివచ్చి పూజలు నిర్వహిస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



న్యాయవాదుల క్రీడలను ప్రారంభిస్తున్న జడ్జి సురేష్

కోదాడటౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని సీనియర్ సివిల్ జడ్జి కె. సురేష్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడ కోర్టులో న్యాయవాదుల క్రీడలు ప్రారంభించారు. న్యాయవాదులు తమ వృత్తి పని ఒత్తిడిలో ఉంటారని వారికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్. లక్ష్మీనారాయణరెడ్డి, కార్యదర్శి రామిరెడ్డి రామకృష్ణ, ఉయ్యాల నర్సయ్య, బండారు రమేష్‌బాబు, సుధాకర్‌రెడ్డి, మేకల వెంకట్రావ్, తమ్మినేని హన్మంతరావు, రంజాన్, పాషా, సాధు, శరత్‌బాబు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

● రోడ్డు ప్రమాదంలో యువకులు మృతి



రోదిస్తున్న మృతుల బంధువులు

తిరుమలగిరి రూరల్, నాగారం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ స్నేహితులు. ఆస్పత్రిలో ఉన్న బంధువును చూసి బైక్‌పై తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృత్యువాతపడ్డారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామానికి చెందిన గొలుసుల వెంకన్న, జయమ్మ దంపతుల చిన్న కుమారుడు నరేష్(25). గొలుసుల రవి, సాలమ్మ దంపతుల చిన్న కుమారుడు ప్రశాంత్. (22) స్నేహితులు. ఇంటర్ వరకు చదివిన వీరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. డెలివరీ కోసం సూర్యాపేట ఆస్పత్రిలో ఉన్న నరేష్ వదినను పరామర్శించడానికి బైక్‌పై సాయంత్రం 5 గంటల ప్రాంతంలో వెళ్లారు. ఆదివారం రాత్రి సుమారు 9గంటల సమయంలో వస్తుండగా నాగారం- ఫణిగిరి గ్రామాల మధ్య గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడు.



ప్రశాంత్, నరేష్(ఫైల్)

గ్రామస్థులతో సమాచారంతో ప్రశాంత్‌ను పోలీసులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. చేతికందిన కుమారులు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. నరేష్, ప్రశాంత్ మంచి స్నేహితులని, మరణంలోనూ స్నేహాన్ని వదలలేదని అక్కడున్న వారు కంటతడి పెట్టుకున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగారం ఎస్‌ఐ ఎం. ఐలయ్య తెలిపారు.

అవిశ్రాంత సమాజ సేవ

▸▸ సామాజిక బాధ్యతతో ముందడుగు

▸▸ ఆదర్శంగా నిలుస్తున్న దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం

వారంతా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందించి ఉద్యోగ విరమణ చేశారు. సమాజానికి ఉపయోగపడే తలంపుతో పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ ముందుకు సాగుతున్నారు. తమ జీవితానికీ కొత్త అర్థాన్ని ఇస్తున్నారు. సమాజంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గానికి చెందిన విశ్రాంత ఉద్యోగులు.

\- దేవరకొండ, ఆంధ్రజ్యోతి



వయోవృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు(ఫైల్)

2001-2002 సంవత్సరంలో అప్పటి అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, పులిజాల శామలయ్య, పంగునూరి లింగయ్య, రాజరత్నంతోపాటు 200 మంది సభ్యులతో సంఘం ప్రారంభమైంది. 2006లో అప్పటి ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి నిధులతో సామాజిక సేవా సాధన్ పేరుతో భవనం నిర్మించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, ఎమ్మెల్యే బాలునాయక్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు భవన నిర్మాణానికి సహకరించారు. ప్రస్తుతం సంఘంలో సభ్యుల సంఖ్య 719కు చేరుకుంది. ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు భవనంలో పత్రికలు చదువుతారు. సభ్యుల యోగా క్షేమాలు తెలుసుకుంటారు. దాతల సహకారంతో కుర్చీలు, టేబుల్స్, వాటర్ కూలర్, క్యారంబోర్డు సమకూర్చుకున్నారు.



సామాజిక సేవా సదన్‌లో ఉచిత కంటి పరీక్షలు(ఫైల్)

సమస్యల పరిష్కారం ..



విశ్రాంత ఉద్యోగులకు సమస్యలు ఎదురైతే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తారు. సంఘంలోని సభ్యులందరూ హెల్త్‌కార్డులు తీసుకున్నారు. ఫ్యామిలీ పెన్షనర్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకొని వారికి న్యాయం జరిగేలా చూస్తున్నారు. సభ్యుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తారు.

సేవా కార్యక్రమాలు

సంఘం ప్రారంభమైనప్పటి నుంచి ఉచిత కంటి వైద్య శిబిరాలు, కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 360మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. హెల్త్ స్కీం ద్వారా ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. ప్రతి సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవాలు, పెన్షనర్ డే, కవి సమ్మేళనాలు, ఇఫ్తార్ విందులు, స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర వేడుకలు, జాతీయ నాయకుల జయంతి, వర్ధంతులు నిర్వహిస్తారు. వయోవృద్ధుల ఆశ్రమ కేంద్రంలో వృద్ధులకు అన్నదానం చేస్తారు. నిరుపేదలను గుర్తించి బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేస్తారు. సభ్యులే విరాళాలు వేసుకొని భవనం రెండో అంతస్తు నిర్మాణం చేపడుతున్నారు.

సేవలు విస్తృతం చేస్తాం



2006 నుంచి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నాను. ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవలు అందిస్తాం. సభ్యులమంతా ఐక్యంగా ఉండి మనోధైర్యం కోల్పోకుండా ఉల్లాసంగా గడుపుతున్నాం. చేసే పనితో సంతృప్తి పొందుతున్నాం.

\- తాటిశెట్టి నర్సింహ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు

సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు



ఉద్యోగ విరమణ చేసినా ప్రజలకు సేవ చేయాలనే తపనతో సభ్యులమంతా కలిసి ఐక్యంతో ముందుకు సాగుతున్నాం. సేవ చేయాలంటే వయస్సు అడ్డు రాదు. పుట్టినరోజు వేడుకలను సభ్యులమంతా ఘనంగా జరుపుకుంటున్నాం. కష్ట సుఖాల్లో ఒకరికి ఒకరం పాలుపంచుకుంటున్నాం.

\- అంకం చంద్రమౌళి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ నియోజకవర్గ కార్యదర్శి

ఆపద వస్తే స్పందిస్తాం



ప్రజా ప్రతినిధులు, దాతల సహకారంతో భవనం నిర్మించుకొని ఉల్లాసంగా గడుపుతున్నాం. సంఘం సభ్యులందరం విధిగా ప్రతిరోజూ సేవా భవన్‌కు వస్తాం. అందరం కలిసిమెలిసి ఉంటాం. సంఘం సభ్యులకు ఆపద వస్తే అందరం స్పందిస్తాం.

\- పంగునూరి లింగయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ నియోజకవర్గ కోశాధికారి.

పింఛన్లు పెంచే వరకూ పోరాటం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



చిట్యాలలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

చిట్యాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆసరా, చేయూత పింఛన్లు పెంచే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్పష్టంచేశారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో సోమవారం జరిగిన నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల పింఛన్‌దారుల సభలో మాట్లాడారు. వృద్ధులు, వితంతువు, ఒంటరి మహిళల, నేత, గీత, బీడీ కార్మికుల పింఛన్ రూ.2నుంచి రూ.4వేలకు, దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలన్నారు. పింఛన్లను పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.100 ఉన్న ఉన్న పింఛన్ రూ.4వేల వరకు వచ్చేందుకు ఎమ్మార్పీఎస్ కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలైనా ఇంకా పింఛన్ల మొత్తాన్ని పెంచలేదని విమర్శించారు. పక్క రాష్ట్రంలో ఆసరా పింఛన్లను రూ.4వేలు, దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు చేయడం లేదని, ప్రశ్నించాల్సిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్, మేడి శంకర్, వీహెచ్‌పీఎస్ నాయకులు తుమ్మల లక్ష్మారెడ్డి, నాయకులు నక్క అశోక్, బకరం శ్రీనివాస్, ఇరిగి శ్రీశైలం, ఎరసాని గోపాల్, కొత్త వెంకన్న, మేడి కృష్ణ, మంకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: వృద్ధులు, దివ్యాంగులు, వితంతు పింఛన్లు పెంచుతామని కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని జరిగిన సమావేశంలో మాట్లాడారు. పింఛన్లు పెంచకుంటే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామన్నారు. పెన్షన్ పెంచడమా? గద్దె దించడమా? ఏదో ఒకటి తేలిపోవాలన్నారు. సెప్టెంబరు 3వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మహా గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడంలో ప్రతిపక్ష నేతలు విఫలమయ్యారన్నారు. అందుకే ప్రజల పక్షాన ఎమ్మార్పీఎస్ పోరాటానికి శ్రీకారం చుట్టిందన్నారు. సమావేశంలో గడ్డం ఖాసిం తదితరులు ఉన్నారు.

పాత టెండర్ విధానమే కొనసాగించాలి

గురుకులాల కాంట్రాక్టర్ల అసోసియేషన్ విజ్ఞప్తి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

నల్లగొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, నాన్‌వెజ్, క్యాటరింగ్‌కు సంబంధించి పాత టెండర్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ గురుకులాల కాంట్రాక్టర్ల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ నాయకులు నాగేందర్, జగదీష్, నాగరాజు, రమేష్ నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త టెండర్ విధానం అమలులోకి తెస్తే ఈ నెల 13వ తేదీ నుంచి అన్ని గురుకులాలకు నిత్యావసర సరుకులను నిలిపి వేస్తామని హెచ్చరించారు. నిత్యావసర సరుకులకు సంబంధించి పాత టెండర్ విధానాన్ని మార్చారని, దీనివల్ల పాత టెండర్ దారులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. నాలుగు నెలల నుంచి బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. కొత్త టెండర్ విధానంలో నిబంధనలు మారిస్తే వాటిని అమలు చేసే ఆర్థిక స్థోమత తమకు లేనందున, ఆ విధానాన్ని సడలించాలని కోరారు. కొత్త టెండర్లలో అధిక ఈఎండీలు పెట్టారని తెలిపారు. మెనూ ప్రకారం కూరగాయలు కావాలంటే మార్కెట్ ప్రకారం ధరలు చెల్లించాలన్నారు.

మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి



శంకుస్థాపన చేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం ఊకొండి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని త్వరితగతిన పూర్తి చేయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, ఎంపీడీవో విజయభాస్కర్, ఏఈ సతీష్ రెడ్డి, డాక్టర్ నర్మదా, పంచాయతీ సెక్రటరీ గీతా, మాజీ సర్పంచ్ నడింపల్లి యాదగిరి, మాజీ ఎంపీపీ మేడి యాదగిరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, భీమనపల్లి సైదులు, వట్టికోటి శేఖర్, బూడిద లింగయ్యయాదవ్, కుంభం చెన్నారెడ్డి ఉన్నారు.

రాజగోపాల్‌రెడ్డిని విమర్శించే అర్హత చల్లమల్లకు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ, శ్రీను

సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని విమర్శించే నైతిక అర్హత చల్లమల్ల కృష్ణారెడ్డికి లేదని యాదాద్రిభువనగిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరెంటోతు శ్రీను నాయక్ అన్నారు. సంస్థాన్ నారాయణపురంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై చల్లమల్ల కృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నియోజకవర్గంలో చల్లమల్లను తిరగనివ్వబోమని హెచ్చరించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మునుగోడు ప్రజలకు న్యాయం చేయడం కోసమే గతంలో కేసీఆర్ ప్రభుత్వంపై రాజగోపాల్‌రెడ్డి యుద్ధం చేశారని, ప్రభుత్వాన్ని మునుగోడు ప్రజల వద్దకు తీసుకొచ్చారని గుర్తుచేశారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరెంటోతు భిక్షపతినాయక్, నాయకులు దోనూరు జైపాల్‌రెడ్డి, ఉప్పల లింగస్వామి, ఏపూరి సతీష్, నోముల మాధవరెడ్డి, జక్కిడి చంద్రారెడ్డి, నయీమ్ షరీఫ్, గుత్తా శేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామచంద్రం, కురిమిద్దె గోపాల్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై..



రమేష్ మృతదేహం

చింతపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగిన వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని పాలెంతాండాలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ ఎం. రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాలెం తాండాకు చెందిన సభావట్ రమేష్(40) నిత్యం మద్యం సేవిస్తుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం అర్ధరాత్రి మద్యం తాగి మండలంలోని మదనాపురం గేట్ సమీపంలో స్పృహ కోల్పోయాడు. సోమవారం మదనాపురం గ్రామస్థులు పనుల కోసం వస్తుండగా రహదారి సమీపంలో మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రమేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారీగా గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

భువనగిరి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. నాలుగు బృందాలుగా పోలీసులు పట్టణంలోని పలు ప్రాంతాలలో తనిఖీలు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక రామ్‌నగర్‌లో గుట్కా ప్యాకెట్లను నిల్వ చేసిన చిన్నం శ్రీశైలం ఇంటిపై దాడులు చేసి తనిఖీ చేశారు. విక్రయాలకు సిద్ధంగా ఉంచిన రూ.1.50 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్, ఎస్‌ఐలు లక్ష్మీ నర్సయ్య, లక్ష్మీనారాయణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా పొగాకు ఉత్పత్తులు, గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయాలు, సరఫరా, నిల్వ తదితర అంశాలపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

మాజీ సర్పంచ్‌పై కేసు

భువనగిరి రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ పురస్కరించుకుని డీజే సౌండ్ ఏర్పాటు విషయంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన మాజీ సర్పంచ్ కడమంచి ప్రభాకర్‌పై కేసు నమోదు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని నందనం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన బోనాల సందర్భంగా డీజే ఏర్పాటు విషయంలో గ్రామానికి చెందిన వానరాసి నర్సింహపై అకారణంగా దాడి చేసిన మాజీ సర్పంచ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆర్టీసీకి రాఖీ ధమాకా

నల్లగొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఆర్టీసీ నల్లగొండ రీజియన్‌కు రాఖీ పౌర్ణమి గిరాకీ కలిసొచ్చింది. రాఖీ పండుగ సందర్భంగా మూడు రోజుల్లో రీజియన్‌లో ఉమ్మడి జిల్లాలోని 7 డిపోల నుంచి ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణించడంతో రూ.6,56,25,000 వేల ఆదాయం సమకూరింది. ఇది ఆర్టీసీ చరిత్రలోనే ఓ రికార్డు. సాధారణంగా రోజువారీ ఆక్యుపెన్సీ (ఓఆర్) 74 వస్తుంది కానీ రాఖీ పండుగ రోజు 122 శాతానికి పైగా ఓఆర్ నమోదైంది. ఫలితంగా ఆదాయం పెద్ద మొత్తంలో సమకూరింది. ప్రతీ రోజు ఆర్టీసీకి రూ.1కోటి నుంచి రూ.1.60 కోట్ల వరకు ఆదాయం వస్తుండగా రాఖీ పండుగ రోజు మాత్రం పెద్ద మొత్తంలో ఆదాయం లభించింది. ఇటీవల ఆర్టీసీ ప్రయాణికులను ఆకట్టుకోవడం కోసం వివిధ రకాల ఆఫర్లు ఇస్తుండటంతో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. రెగ్యులర్‌కు వచ్చే ఆదాయానికి తోడు అదనంగా వచ్చిన ఆదాయంతో ఆర్టీసీ లాభాల బాట చేరింది. సోమవారం తిరుగు ప్రయాణంతో మరో 2లక్షల మంది వివిధ ప్రాంతాలకు చేరుకోవడం వల్ల రూ.2కోట్ల రెవెన్యూ రానుంది. మొత్తంగా ఈ నాలుగు రోజులు కలిపి రూ.8.56 కోట్లకు పైగా రెవెన్యూ చేరుకోనుంది.



- మూడు రోజుల్లో రూ.6.56కోట్లకు పైగా ఆదాయం
- సోమవారం తిరుగు ప్రయాణంతో పెరగనున్న రూ.2 కోట్ల రెవెన్యూ
- బస్సుల్లో మొత్తం 12 లక్షల మందికి పైగా ప్రయాణం

మూడు రోజుల్లో డిపోల వారీగా ఆదాయం ఇలా...

డిపో	ఈ ఏడాది	గతేడాది
	ఆదాయం (లక్షల్లో)	
దేవరకొండ	127.88	1,74,213
నల్లగొండ	102.61	1,65,340
నార్కట్‌పల్లి	19.98	30,341
మిర్యాలగూడ	101.84	1,51,411
యాదగిరిగుట్ట	86.34	1,41,507
కోదాడ	76.85	1,13,760
సూర్యాపేట	140.73	1,99,716
మొత్తం	656.25	6,46,63,000

రీజియన్‌లోని 7 డిపోల పరిధిలో

నల్లగొండ రీజియన్‌లో 7 డిపోలు ఉన్నాయి. ఈ డిపోల పరిధిలో శుక్ర, శని, ఆదివారాల్లో సుమారు 750 బస్సులు 8లక్షల కిలోమీటర్లకు పైగా ప్రయాణించాయి. దీంతో రూ.6.56 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఆర్టీసీ అధికారులు తీసుకున్న నిర్ణయాలతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు అధిక సంఖ్యలో బస్సులు నడిపించడంతో ఆదాయం పెరిగింది. రీజియన్‌లో ఉన్న బస్సులన్నింటినీ రోడ్డెక్కించారు. సిబ్బందిని ప్రోత్సహించడంతో మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు సమష్టిగా కృషి చేశారు. ఫలితంగా ఒక్క బస్సు కూడా బ్రేక్‌డౌన్ కాకుండా తిరిగేందుకు చేసిన కృషి ఫలించింది. పండుగ రోజు ఉదయాన్నే సూపర్‌వైజర్లు, సిబ్బంది రోడ్లపైకి వచ్చి ప్రైవేటు కార్లు, జీపులు, ఆటోలు రాకుండా కట్టుదిట్టం చేసి ప్రయాణికులందరినీ ఆర్టీసీ బస్సులో ఎక్కేలా ప్రోత్సహించారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితం కావడంతో ప్రయాణికులు ఇటువైపే మొగ్గుచూపారు.

హైదరాబాద్ నుంచి నల్లగొండ వచ్చే నాన్‌స్టాప్‌లు, మిర్యాలగూడ, కోదాడ, నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఒక్కో నాన్‌స్టాప్ బస్సుకు ఇద్దరు కండక్టర్లకు టిమ్స్ మిషన్లు ఇచ్చి నిమిషాల్లో టికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేసి బస్సులు జాం కాకుండా, ప్రయాణికులు చికాకు పడకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో అత్యధిక ఆదాయాన్ని నల్లగొండ రీజియన్ సాధించిందని సిబ్బంది తెలిపారు. రాష్ట్రంలోనే నల్లగొండ రీజియన్ 122శాతం ఓఆర్‌తో మొదటి స్థానంలో నిలవడంతో రీజియన్ అధికారులకు సంస్థ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

సెలవు పెట్టని మహిళా ఉద్యోగులు

వాస్తవానికి రాఖీ పండుగ రోజు మహిళా కండక్టర్లు, ఉద్యోగులు సెలవులు పెట్టి పండుగకు వెళ్తుంటారు. అయితే నల్లగొండ రీజియన్‌లో సుమారు 500 మంది మహిళా ఉద్యోగులు, కండక్టర్లు సిబ్బంది, సంస్థ అభ్యున్నతి కోసం పనిచేయడం విశేషం. మహిళా ఉద్యోగులు రాఖీ పండుగ రోజు కూడా పనిచేయడంతో వారందరినీ సంస్థ ఉన్నతాధికారులు అభినందించారు. అధికారిక లెక్కల ప్రకారం మహాలక్ష్మి పథకం కింద మహిళలు సుమారు 6.50 లక్షల మంది ప్రయాణించగా పురుష ప్రయాణికులు సుమారు 3.50 లక్షల మంది ప్రయాణించారు. అత్యధికంగా కిలోమీటర్ల ప్రయాణ విషయంలో సూర్యాపేట డిపో 1,84,530 కిలోమీటర్లు బస్సులను నడిపి మొదటి స్థానంలో ఉండగా, రెండో స్థానంలో మిర్యాలగూడ డిపో పరిధిలో 1,51,620 కి.మీలు ప్రయాణించగా, నల్లగొండ డిపో పరిధిలో 1,50,823 కి.మీలు ప్రయాణించి మూడో స్థానంలో నిలిచింది. దేవరకొండ డిపో పరిధిలో 1,43,676 కిలోమీటర్లు బస్సులు ప్రయాణం చేశాయి. కోదాడ డిపో పరిధిలో 1,14,422 కిలోమీటర్లు, యాదగిరిగుట్ట డిపో పరిధిలో 1,21,881 కిలోమీటర్లు, అత్యంత తక్కువగా నార్కట్‌పల్లి డిపో పరిధిలో 22,395 కిలోమీటర్ల దూరం బస్సులు ప్రయాణించాయి.

ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేశారు



ఉద్యోగుల సమష్టి కృషితో రాఖీ పండుగ రోజు రీజియన్‌కు అదనపు ఆదాయం లభించింది. ఉద్యోగులందరికీ పేరుపేరున ధన్యవాదాలతో పాటు అభినందనలు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రతీ ఒక్క ఉద్యోగి, అధికారి కృషి చేసి ఆర్టీసీని ఆదాయంతో ముందుకు నడిపించాలి. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించడంతో పాటు ఆర్టీసీ బస్సు ప్రయాణం వల్ల భద్రత కూడా ఉంటుంది. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఆర్టీసీ సిబ్బంది రాఖీ పండుగకు సెలవులు పెట్టకుండా పనిచేయడం ఎంతో సంతోషకరమైన విషయం.

- కె.జాన్‌రెడ్డి, ఆర్‌ఎం, నల్లగొండ

నీరా కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ

భువనగిరిగంజ్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం నందనం గ్రామంలో గీత కార్మికుల ఉపాధి అవకాశాలు పెరగడానికి నిర్మించిన నీరా కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సంక్షేమం విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గీత కార్మికులకు సంబంధించి 710మందికి పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా డబ్బులు విడుదల చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు, జిల్లా అధ్యక్షుడు రాగీర్ కృష్ణయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమిలె మహేందర్, మద్దెల రాజయ్య, దూపాటి వెంకటేష్, అంతటి అశోక్, బత్తిని భిక్షం, జిల్లా ఉపాధ్యక్షుడు ఎరుకల భిక్షపతి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయాలి

భువనగిరి గంజ్: భారత ఎన్నికల సంఘం (ఈసీ) కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అనుబంధంగా వ్యవహరించడం తగదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. బిహార్ రాష్ట్రంలో ఓటరు జాబితాలో అవకతవకలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నర్సింహ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయాలే కానీ ఏ పార్టీకి అనుబంధంగా పనిచేయకూడదని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, ఏదునూరి మల్లేశం, వనం రాజు, అన్నంపట్ల కృష్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు

అసమ్మతి గళంతో

కాంగ్రెస్‌లో దుమారం

(5వపేజీ తరువాయి)

పేర్కొనడం గమనార్హం. కాంగ్రెస్ కీలకనేతలు ఒక్కొక్కరుగా రాజగోపాల్‌రెడ్డి వాదనపై ఏదో రకంగా స్పందిస్తుండడం, ఈ చర్చ పతాకస్థాయికి చేరడంతో అధిష్ఠానం దీనికి ఎలా ముగింపు పలుకుతుందోనని కాంగ్రెస్ క్యాడర్ ఎదురుచూస్తోంది.

రాజగోపాల్‌పై విమర్శలతో తెరమీదకు చల్లమల్ల

తాజా పరిణామాల నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గానికి చెందిన చల్లమల్ల కృష్ణారెడ్డి సోమవారం మర్రిగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజగోపాల్‌రెడ్డిపై విమర్శలు చేయడం, వెంటనే కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆయనపై ప్రతివిమర్శలు చేయడంతో సోషల్‌మీడియాలో దుమారం చెలరేగింది. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ధ్యాస మునుగోడు అభివృద్ధిపై లేదని కృష్ణారెడ్డి విమర్శించారు. అంతేకాకుండా మంత్రి పదవి, కాంట్రాక్టు రాలేదని రాజగోపాల్‌రెడ్డి అసమ్మతి రాగం ఎత్తుకున్నారని పేర్కొంటూ కృష్ణారెడ్డి విమర్శించడాన్ని రాజగోపాల్‌రెడ్డి అనుచరులు, కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో ఖండించారు. చల్లమల్ల కృష్ణారెడ్డికి కాంగ్రెస్‌తో సంబంధం లేదని, అతను కాంగ్రెస్‌లో చేరానని చెప్పుకోవడాన్ని ఖండిస్తున్నామని యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలో కొనసాగుతూ, రాజగోపాల్‌రెడ్డిని ఓడగొట్టేందుకు, కాంగ్రెస్‌ను నష్టపరిచేందుకు తీవ్రంగా ప్రయత్నించారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి జానారెడ్డిని చల్లమల్ల కృష్ణారెడ్డి అసభ్యంగా తిడుతున్నారని తిట్టారని, బ్లాక్‌మనీ కాపాడుకోవడానికే ఆయన కాంగ్రెస్‌లోకి రావాలని చూస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లో ఆయన్ని పార్టీలోకి రానీయమని సంజీవరెడ్డి ప్రకటనలో తెలిపారు. మరోవైపు చల్లమల్ల విమర్శలను ఖండిస్తూ సంస్థాన్‌నారాయణపురం మండల కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎంతగానో కష్టపడిన రాజగోపాల్‌రెడ్డిని విమర్శించే నైతికస్థాయి కృష్ణారెడ్డికి లేదని, మరోసారి నోరు పారేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కోట్లాది రూపాయల సొంత నిధులతో ప్రజాసేవ చేస్తున్న రాజగోపాల్‌రెడ్డిని విమర్శించే స్థాయి కృష్ణారెడ్డికి లేదన్నారు. ఇంతగా నోరు పారేసుకుంటున్న కృష్ణారెడ్డి భువనగిరి లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎటు పోయారని నిలదీశారు. మొత్తంగా మునుగోడు నియోజకవర్గంలో మరోసారి రాజకీయం వేడెక్కుతుండడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

యాదగిరిగుట్టలో శివకేశవులకు విశేష పూజలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి, అమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విష్వక్సేనుడికి తొలిపూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తులకు అర్చకులు మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు.



శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

15న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిషనర్, ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. యాదగిరికొండపై సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన కొండకింద సత్యదేవుని 2వ వ్రత మండపంలో ఉదయం 11 గంటలకు ఉచిత వ్రతాల నిర్వహణకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సామూహిక వ్రతాల్లో పాల్గొనే వారు వ్రత మండపం కార్యాలయం వద్ద ఈ నెల 13న సాయంత్రం 5 గంటల వరకు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఎలాంటి రుసుము లేకుండా పూజ సామగ్రితో ఉచితంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు, మరిన్ని వివరాల కోసం వ్రత మండపం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు..

ప్రధానార్చకుడిగా సురేంద్రచార్యులు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధానార్చకుడిగా భట్టర్ సురేంద్రచార్యులు నియమితులయ్యారు. ఇప్పటికే ప్రథమ ప్రధానార్చకుడిగా కాందూరి వెంకటాచార్యులు కొనసాగుతుండగా సోమవారం ద్వితీయ ప్రధానార్చకుడిగా భట్టర్‌ను నియమిస్తూ ఆలయ ఈవో వెంకట్రావు ఉత్తర్వులు జారీ చేశారు. 1992సంవత్సరంలో దేవస్థానంలో అర్చకవృత్తిని స్వీకరించి 33 ఏళ్లుగా స్వామిఅమ్మవార్లకు పలు రకాల సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకు ఉపప్రధానార్చకుడి హోదాలో విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం ప్రధానార్చకుడిగా నియమితులు కాగా అర్చకులు శుభాకాంక్షలు తెలిపారు. గత నెల 31న ప్రధానార్చకుడిగా నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు ఉద్యోగ విరమణ చేశారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి :మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగళ్య ధారణ తలంబ్రాలతో కల్యాణాన్ని జరిపించారు .అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకుల పాల్గొన్నారు.

వైదిక కమిటీ నియామకం : ఈవో

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్య కైంకర్యాలు, పూజల్లో ఎలాంటి అంతరాయం ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వైదిక కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు చెప్పారు. కొండపైన ప్రధాన కార్యాలయంలో సోమవారం కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూజా విధానం, భక్తులకు దర్శనం కల్పించేందుకు వైదిక సిబ్బంది పనితీరు గ్రహించాలని కమిటీకి సూచించారు. పలు అంశాలను కమిటీ పరిశీలిస్తూ తగు సలహాలు, సూచనలు చేయాలన్నారు. నూతన వైదిక కమిటీ చైర్మన్‌గా అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ప్రధానార్చకుడు కాందూరి వెంకటాచార్యులు, ప్రధాన పురోహితుడు గౌరిభట్ల సత్యనారాయణ, శివాలయం ప్రధానార్చకుడు నరసింహరాములు, వేద పండితుడు శ్రీనివాసశర్మ, ఏఈవో జూశెట్టి కృష్ణను నియమించారు.



వైదిక కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఈవో వెంకట్రావు

చెరువులు, కుంటలను నింపాలి

● నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య


నల్లగొండ(కలెక్టరేట్), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలను నాగార్జునసాగర్ నీటితో నింపాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ నుంచి నీరు వృథాగా సముద్రంలో కలుస్తుంటే చెరువులు, కుంటలు నింపకుండా జిల్లాకు చెందిన మంత్రులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులో నాలుగు మోటార్లలో కేవలం మూడు మోటార్లతోనే నీటిని ఎత్తిపోస్తున్నారని అన్నారు. దీంతో దిగువ ప్రాంతమైన పానగల్, అయిటిపాముల ఎత్తిపోతల పథకం, కేతేపల్లి మండలాలలోని చెరువులు, కుంటలు నింపడానికి వీలు లేకుండా పోయిందని అన్నారు. బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామని ప్రకటించారని, నాటి నుంచి నేటి వరకు ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు.

ముఖ్యమంత్రి, మంత్రులు, కలిసి నల్లగొండ జిల్లాను ఎడారిగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారే అయినా సాగునీరు, ప్రజలకు తాగునీరు సక్రమంగా అందించకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా జిల్లాలోని చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. దశలవారీగా అన్ని చెరువులు, కుంటలు నింపుతామని చెబుతున్నా మోటార్లను రిపేర్ చేయకుండా చెరువులు, కుంటలు నింపే పరిస్థితి ఉండదని అన్నారు. ఇప్పటికైనా సాగు, తాగునీటి రంగంపై దృష్టి సారించి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండూరు శంకర్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, వడ్డె సైదిరెడ్డి, బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోస్తున్న ప్రాజెక్టులు

● 4 క్రస్టు గేట్ల నుంచి సాగర్ నీటి విడుదల ● 589.30 అడుగులకు చేరుకున్న నీటి మట్టం ● మూసీలో మూడు క్రస్టుగేట్ల ఎత్తివేత

నాగార్జునసాగర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 4 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం 8 గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు సాగర్ నీటిమట్టం అర అడుగు తగ్గడంతో సోమవారం ఉదయం 10 గంటల కు రెండు గేట్లను మూసివేసి ఆరు గేట్ల ద్వారా, తర్వాత మధ్యాహ్నం మరో రెండు గేట్లను మూసివేసి 4 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు)కాగా సోమవారం సాయంత్రానికి 589.30అడుగులుగా (309. 9534 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 7,086 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 6,173 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,542 క్యూసెక్కులు, నాలుగు క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 32,108 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 76,009 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువనుంచి 65,800 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.




నాగార్జునసాగర్ ప్రాజెక్టు నాలుగు క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ నెల 5 నుంచి మూసీ నదికి వరద ఉధృతి కొనసాగుతుంది. దీంతో మూసీ డ్యాం అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ప్రాజెక్టు క్రస్టు గేట్ల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 643 అడుగుల గరిష్ఠ స్థాయిలో ఉండేలా చూస్తూ అదనపు నీటిని ప్రాజెక్టు క్రస్టుగేట్లను ఎత్తి దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం 4719.16 క్యూసెక్కులుగా ఇన్‌ఫ్లో నమోదైంది. ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ప్రాజెక్టు 2, 3, 10 నెంబరు క్రస్టుగేట్లను 2 అడుగుల మేర ఎత్తి 3860.58 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉంటే 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.38అడుగులు (4.04టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 454.86 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వారం రోజుల క్రితం వెలవెల.. నేడు కళకళ

మఠంపల్లి: ప్రకృతి సహకరిస్తే ఏదైనా జరుగుతుంది... వారం రోజుల క్రితం మట్టపల్లి వద్ద కృష్ణానది వెలవెలబోయి కనిపించింది. కానీ నేడు కళకళలాడుతూ... గలగల పారుతూ కృష్ణమ్మ పరుగు తీస్తోంది. పది రోజుల క్రితం వరకు సాగర్‌కు నీరందుతుందా..? లేదా వ్యవసాయం సాగవుతుందా లేదా అని ఆయకట్టు రైతులు ఆందోళన చెందారు. కృష్ణా బేసిన్‌లో సమృద్ధిగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టులన్నీ నిండి ఆ వరద సాగర్ ప్రాజెక్టుకు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు నిండి కుడి, ఎడమకాల్వలకు నీటిని విడుదల చేయడం, ఆ వెంటనే ప్రాజెక్టు ద్వారా 24 గేట్లను ఎత్తి 4లక్షల 35వేల క్యూసెక్కుల నీటిని పులిచింతల ప్రాజెక్టు వైపునకు వదులుతున్నారు. దీంతో మట్టపల్లి వద్ద కృష్ణానది కళకళలాడుతూ ప్రవహిస్తోంది. ఉధృతి ఇలానే కొనసాగితే ఎల్‌ఆర్‌ఎల్ లెవల్ దాటే పరిస్థితి నెలకొంది. నీటి రాకతో భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీరు సమృద్ధిగా ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు గ్రామాల్లో సైతం ఇళ్లలో బోర్లు ఎండిపోయిన దుస్థితి నెలకొంది. ప్రకృతి కరుణించి కృష్ణానది పొంగి పొర్లుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మట్టపల్లి వంతెన వద్ద ఉధృతంగా కృష్ణానది ప్రవాహం

ర్యాలీని జయప్రదం చేయాలి

కనగల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కనగల్ మీదుగా నల్లగొండకు వెళ్లే రెజంగ్ల రజ్ కలశయాత్రను జయప్రదం చేయాలని యాదవసంఘం మండల అధ్యక్షుడు జెట్టి శ్యాంసుందర్‌యాద్, యువజన నాయకుడు మండలి పరమేష్‌యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రెజంగ్ల యాత్ర కనగల్ ఎక్స్‌రోడ్డుకు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుందని వివరించారు. యాత్రకు ఘనస్వాగతం పలకాలని కోరారు.

భూభారతి దరఖాస్తులను వెంటనే పరిశీలించాలి

కట్టంగూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో తీసుకున్న భూభారతి దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దపాటి సుధాకర్, మండల నాయకుడు గంట మల్లేష్ కోరారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కట్టంగూరులో ఇన్‌చార్జి తహసీల్దార్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. భూ భారతి దరఖాస్తులు తీసుకొని నెలలు గడుస్తున్నా పరిష్కరించడం లేదని పేర్కొన్నారు. వారి వెంట సంఘం నాయకులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించరూ

'ప్రజావాణి'కి వెల్లువెత్తిన వినతులు

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పింఛన్ ఇప్పించాలని ఒకరు....ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని మరొకరు....అధికారులు వేధింపుల నుంచి ఆదుకోవాలని, మా భూమి మాకు ఇప్పించాలని ఇంకొకరు ఇలా రకరకాల సమస్యలతో అనేక మంది బాధితులు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి వారం వారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అనేకమంది బాధితులు హాజరయ్యారు. వారిలో కొందరు వ్యక్తిగత సమస్యలపై రాగా మరికొందరు సామాజిక అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి వారి వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు లేఖలు రాశారు.



బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

వితంతు పెన్షన్ ఇప్పించండి



నేను నిరుపేద కుటుంబానికి చెందిన వాళ్లం. నా భర్త ఐదేళ్ల క్రితం చనిపోయాడు. నాకు ఇద్దరు సంతానం. భర్త చనిపోయాక కూలీనాలీ పని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్నాను. నాకు ఉండేందుకు కనీసం ఇల్లు కూడా సరిగా లేదు. భర్త మరణానంతరం వచ్చే వితంతు పింఛన్ కూడా రావడం లేదు. ఐదేళ్లుగా పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదు. దయచేసి పింఛన్ ఇప్పించి ఆదుకోగలరు.

- పార్వతి, వెంకటాద్రిపాలెం, మిర్యాలగూడ

నా భూమి నాకు ఇప్పించండి



నాకు మా గ్రామ శివారులోని వివిధ సర్వే నెంబర్లలో 24 గుంటల భూమి ఉంది. దానికి సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకాలు యాజమాన్య హక్కుల పత్రం కూడా ఉంది. నేను అనారోగ్యం కారణంగా వర్షాధారమైన ఈ భూమిలో సేద్యం చేయలేకపోయాను. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు కొందరితో కుమ్మక్కై, వేరే వారి పేరిట తన భూమిని పట్టా చేశారు. అనారోగ్యం నుంచి కోలుకున్నాక సేద్యం చేసేందుకు వెళ్లగా అడ్డుకోవ డమే కాకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. దయచేసి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి న్యాయం చేయాలి.

- జటావత్ భోజ్యా, నెల్లికల్, తిరుమలగిరిసాగర్

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి



నేను కొంతకాలం క్రితం ఎనిమియా వ్యాధి బారిన పడ్డాను. దీంతో 2004 నుంచి ఇప్పటివరకు 96 ప్యాకెట్ల రక్తం ఎక్కించుకోవడం జరిగింది. రెగ్యులర్‌గా రక్తం ఎక్కించుకోకపోవడంతో నా శరీరంలో మార్పులు చోటు చేసుకుంటాయి. ఆసుపత్రి ఖర్చు నిమిత్తం నెలకు 2 నుంచి 5 వేల వరకు ఖర్చు వస్తుంది. 32 సంవత్సరాలుగా పట్టణంలోని అద్దె ఇంట్లోనే కిరాయికి ఉంటున్నాను. గతంలో తన దీనగాధను అధికారులకు విన్నవించుకోగా డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు కూడా నాకు ఇల్లు మంజూరు కాలేదు. దయచేసి ఇప్పటికైనా ఇంటిని మంజూరు చేసి ఆదుకోండి.

- జంపరాతి భద్రయ్య, దారుషఫాకాలనీ, నల్లగొండ.

అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు



మేము నిరుపేద కుటుంబానికి చెందిన వారిమి. మాకు ఉండేందుకు కనీసం ఇళ్లు కూడా లేక అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. ఇటీవలే ఉన్న కొద్దిపాటి స్థలంలో చిన్న గుడిసె వేసుకొని కూలీనాలీ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. అయితే విచారణ కోసం వచ్చిన అధికారులు తమకు ఇల్లు ఉందంటూ తప్పుడు నివేదిక సమర్పించారు. దీంతో మాకణు ఇళ్లు మంజూరు కాకుండా పోయింది. దయచేసి ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి అన్ని అర్హతలు ఉన్న తమకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలి.

- పెరికే చిన్ని తల్లి, తుర్కోని బావి, గుర్రంపోడు

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సౌండ్ సిస్టమ్‌ను అందజేస్తున్న రేగట్టె

నార్కట్‌పల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉండే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో గ్రామస్థులు కూడా భాగస్వాములు కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెర్వుగట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామ మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, దాసోజు కోటి సంయుక్తంగా సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మల్లిఖార్జున్‌రెడ్డి సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా రేగట్టె మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల కనీస అవసరాలు తీర్చేందుకు ఏ సాయం కావాలన్నా చేస్తామని హామీ ఇచ్చారు. సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలలో జరిగే ఈవెంట్ల సమయంలో వినియోగించుకోవాలని సూచించారు. సౌండ్ సిస్టంను బహూకరించిన దాతలకు ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో దాతలు మల్ల బాలకృష్ణ, దాసోజు కోటి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

శాలిగౌరారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గత జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పాస్ పుస్తకం వచ్చిన రైతులందరూ రైతు బీమా కోసం ఈ నెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సౌమ్య శృతి తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వరకు వయస్సు ఉన్న రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జీరాక్స్‌లతో పూర్తి చేసిన దరఖాస్తులను ఏఈవోలకు అందజేయాలని కోరారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు గుత్తా రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని అంబారిపేట గ్రామంలో నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క పేద కుటుంబానికి రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు లింగస్వామి, రేషన్ డీలర్ నూనె పద్మ - నాగరాజు, నాయకులు జానీ, శేఖర్, నాగయ్య, సైదులు, రవీందర్ రెడ్డి, మల్సూర్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, వెంకన్న, సత్తమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువును పొడిగించాలి

శాలిగౌరారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతు బీమా దరఖాస్తు గడువును వెంటనే పొడిగించాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, సీనియర్ నాయకుడు సరిపంగి రాములు కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా పాసు పుస్తకాలు తీసుకున్న వారికి రైతు బీమా దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 13వ తేదీ చివర తేదీగా ప్రకటించారని తెలిపారు. వర్షాలు, గ్రామ దేవతలు, రాఖీ పండుగ కారణంగా వరుస సెలవులు రావడంతో రైతులకు సరిగా తెలవడం లేదన్నారు. అధికారులు వెంటనే గమనించి మరో వారం రోజులు గడువు పొడిగించాలన్నారు. జీవిత బీమా ఐదు లక్షల నుంచి రూ.10లక్షల వరకు వర్తింపచేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మండల కోఆప్షన్ సభ్యులు దాసరి దే వచిత్రం, గీత కార్మిక మండల నాయకులు కల్లూరు లింగయ్య ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



కస్తూర్బాలో సాంబారు రుచి చూస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను సోమవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సందర్భంగా పాఠశాలలో వండిన భోజనాన్ని ఆయన రుచి చూసి పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వంటం లేదని గమనించిన ఎమ్మెల్యే వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచినా, ఆహార నాణ్యత పెరగలేదని అన్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వేడి నీటి సదుపాయం, పడుకోవడానికి బెడ్స్, పరుపులు, దుప్పట్లు, ఆడుకోవడానికి ఆట స్థలం కావాలని, సరిపడా బాత్‌రూమ్‌లు కల్పించాలని కోరారు. త్వరలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న పబ్లిక్ పరీక్షల దృష్టిలో ఉంచుకొని సిలబస్, ప్రత్యేక శిక్షణ, తరగతుల నిర్వహణ, ప్రశ్న, జవాబు పత్రాల నమూనాలపై అవగాహన, భోజనం, స్నాక్స్, వంద శాతం ఫలితాలు వచ్చేలా శ్రద్ధ వహించాలని పాఠశాల ఎస్‌వో మంజులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోదాములు ఖాళీల్లేవ్..

(5వ పేజీ తరువాయి)

నిండిపోవడంతోపాటు, మిల్లుల్లోనూ సన్నబియ్యంకు సంబంధించి, గత వానాకాలం సీజన్ బియ్యం సైతం నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో తక్షణమే గోదాముల్లో ఉన్న బియ్యంలో ఎఫ్‌సీఐకి పంపాల్సిన 2,46,267 మెట్రిక్‌టన్నుల బియ్యానికి అనుమతులు తీసుకోవడంతోపాటు, రవాణాకు...సంబంధించిన రైల్వే ర్యాకులు వచ్చేందుకు రాష్ట్ర సివిల్‌సప్లయ్ సంస్థ చొరవతీసుకోవాలని, లేదంటే మిల్లులు నడిపే పరిస్థితి లేదని మిల్లర్లు చెబుతున్నారు. ఈమేరకు గోదాముల్లో బియ్యం తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ ఇలాత్రిపాఠికి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు జిల్లా మిల్లర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్నాటి నారాయణ, రేపాల భద్రాద్రి, కార్యవర్గసభ్యుడు జె.ఇంద్రారెడ్డి తదితరులు వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు పేర్కొన్న అంశంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎఫ్‌సీఐకి బియ్యం తరలించేందుకు, రైల్వే వ్యాగన్ల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని వారికి కలెక్టర్ హామీ ఇచ్చారు.

ప్రజా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



గూడాపూర్‌లో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న శ్రీశైలం

మునుగోడు రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాలు నిర్వహించినప్పుడే ప్రభుత్వాలు దిగివచ్చి ప్రజా సమస్యలను పరిష్కరిస్తాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. సోమవారం ఇంటింటికి సీపీఎం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గూడపూర్, కొరటికల్ గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సంవత్సరాల తరబడి అనేక సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతుంటే పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. గూడపూర్ గ్రామంలో 30 సంవత్సరాల క్రితం ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మించారు కానీ , నీటిని నిల్వ చేసేందుకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా మారిందని గ్రామ ప్రజలు తెలిపారు. బీరప్ప గుడి నుంచి శ్మశాన వాటిక స్థలం మీదుగా పైప్ లైన్ నిర్మాణం చేపడితే ట్యాంకు నిరుపయోగంగా ఉండకుండా వినియోగంలోకి వస్తుందని అన్నారు. నల్లగొండ నుంచి కొరటికల్ మీదుగా చండూరుకు పల్లె వెలుగు బస్సును నడిపించాలని కోరారు. కొరటికల్, గూడపూర్ గ్రామాల్లో పలు వీధుల్లో సీసీ రోడ్లు మురికి కాలువలు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ ఎర్రజెండా వేగుచుక్కయి ఉద్యమాలకు ఊపిరి పోస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మండల కమిటీ సభ్యులు పగడాల కాంతయ్య, డోలు దెబ్బ వ్యవస్థాపకులు మాల్గా యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తమ్మడపల్లిలో సర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మర్రిగూడ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విషజ్వరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మర్రిగూడ ప్రభుత్వ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శాలిని అన్నారు. మండల పరిధిలో పల్లు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటా జ్వరం సర్వేను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. మండలంలోని తిరగండ్ల పల్లి, తమ్మడపల్లి, అజలాపురం, ఎర్రగడ్డ పల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇప్పటివరకు 171 గృహాలను సందర్శించినట్లు తెలిపారు. ఇంటింటికీ తిరుగుతూ జ్వరాల బారిన పడిన వారి పేర్లను కూడా రిజిస్టర్లలో నమోదు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వివరించాలని, ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

'పండుగ పూట ఆర్టీసీ చార్జీల పెంపు విచారకరం'

నల్లగొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పండుగల పేరిట ఆర్టీసీ చార్జీలు పెంచడం సిగ్గుచేటని టీడీపీ నల్లగొండ అసెంబ్లీ మాజీ ఇన్‌చార్జి ఎల్వీయాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పండుగ అయిపోయిన తర్వాత కూడా ప్రయాణికులపై టికెట్ ధర పెంచి దోచుకోవడం సరైనది కాదన్నారు. ఇప్పటికే ఇచ్చిన వాగ్దానాలను అంతంత మాత్రంగా అమలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

శాలిగౌరారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్‌లో నైట్ వాచ్‌మన్ పోస్టుకు మహిళా అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో మందుల సైదులు తెలిపారు. 10వ తరగతి పాస్ అయి 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని కోరారు. అర్హులైన మహిళా అభ్యర్థులు మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్ కేర్ టేకర్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి

కట్టంగూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లేపల్లి గ్రామపంచాయతీ నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బొల్లేపల్లి గ్రామస్థులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ బొల్లేపల్లి నుంచి చిన్నసూరారం, పెద్దసూరారం, పెరిందేవిగూడెం, నల్లగొండ రోడ్డు వరకు ఉన్న రోడ్లన్నీ గుంతలమయంగా మారి ప్రమాదకరంగా మారాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, క్రాంతికుమార్, భానుప్రసాద్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

● కట్టంగూరు మండలంలోని ఈదులూరు చెరువు కింద నీట మునిగిన పంట పొలాలకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా నీటిని వదలడంతో పంట పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మర్రిగూడ పీహెచ్‌సీకి మహర్దశ

● 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌గా చేస్తూ జీవో జారీ




మర్రిగూడ పీహెచ్‌సీ భవనం

మర్రిగూడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల కేంద్రంలో ఉన్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్ గ్రేడ్‌గా మారుస్తూ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కార్యాలయం జీవో జారీ చేయడంతో ఈ ఆస్పత్రి దశ మారనుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమైన మర్రిగూడెం మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో, అదే విధంగా రోగులు అత్యవసర సేవల కోసం హైదరాబాద్‌కు వెళ్లకుండా ఈ ప్రాంతంలోనే నిరుపేదలకు వైద్య సేవలందించాలనే ఉద్దేశ్యంతో అప్‌గ్రేడ్ చేశారు. నిత్యం 30 పడకల ఆస్పత్రికి 500 నుంచి 600 మంది వరకు రోగులు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. ప్రస్తుతం 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చడం వల్ల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో కాన్పులతో పాటు ఇతర ఆపరేషన్లు కూడా చేసే అవకాశం ఉంది. అదేవిధంగా ప్రస్తుతం 30 పడకల ఆస్పత్రిలో 15మంది వైద్య నిపుణులు ఉండాల్సి ఉండగా కేవలం ఆరుగురితోనే వైద్య సేవలందిస్తున్నారు. 50 పడకల ఆస్పత్రి అప్‌గ్రేడ్‌గా మార్చినందున ఎక్కువ మంది పీజీ డాక్టర్లతో వైద్యులతో పాటు మరో 9 మంది కాంటిజెంజెన్సీ వర్కర్లు పోస్టులు పెరగనున్నాయి. వైద్య విధాన పరిషత్ ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు అత్యవసర సేవలు కూడా అందించి రోగులు ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయించకుండా చర్యలు చేపడుతున్నారు. గత ప్రభుత్వం ఈ 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ మూడేళ్ల క్రితం జీవో జారీ చేసింది. ఈ ప్రాంతంలో వంద పడకల ఆసుపత్రి వద్దని చౌటుప్పల్ మండలానికి తరలించడంతో ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమైన మర్రిగూడ మండల ప్రాంత ప్రజలు నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. ప్రస్తుతం 30 పడకల కమ్యూనిటీ హెల్త్ ఆరోగ్య ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయముపై మర్రిగూడ సూపరింటెండెంట్ శంకర్‌నాయక్‌ను వివరణ కోరగా రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఈ ప్రభుత్వాస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌గా మార్చి జీవో జారీ చేసింది నిజమేనని, కానీ మాకు ఎలాంటి ఆర్డర్ రాలేదని ఆయన తెలిపారు.

బీసీ రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ తీరు హాస్యాస్పదం

● ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సత్యం

మునుగోడు, మర్రిగూడ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలుపై శాసనసభలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలు ఆమోదించారని అయినా రిజర్వేషన్లను ఆమోదించకుండా కేంద్రంలోని బీజేపీ అడ్డుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మునుగోడు, మర్రిగూడ మండలాల్లో సోమవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ బిల్లుపై రాష్ట్రంలో మద్దతు తెలిపిన బీజేపీ కేంద్రంలో మాత్రం అడ్డుకుంటూ ద్వంద్వవైఖరి అవలంబిస్తుందని అన్నారు. బీజేపీ మొదటి నుంచి ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలకు వ్యతిరేకమన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం మీద బీజేపీకి నమ్మకం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కవితకు బీసీ రిజర్వేషన్లు గుర్తు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. నేడు బీసీ రిజర్వేషన్ల అమలుపై ధర్నా చేస్తామనడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. బీసీలపై ప్రేమ ఉంటే బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముస్లింలలో కూడా నిరుపేదలైన బీసీలు కూడా ఉన్నారనే విషయాన్ని గమనించాలనారు. ప్రభుత్వం నిరుపేదల కోసం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం విషయంలో అధికారులు ఎలాంటి ఆంక్షలు విధించకూడదని, ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ప్రతి నిరుపేద లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేసుకోవడానికి అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

మునుగోడు పార్టీ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. మునుగోడులో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు తీర్పారి వెంకటేశ్వర్లు, గోసుకొండ లింగయ్య, ఉప్పునూతల రమేష్, కాయితం వెంకన్న, బూడిద లింగస్వామి, పాండు, కొరటికల్ మాజీ సర్పంచ్ వల్లూరి పద్మలింగయ్య, మర్రిగూడలో నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల ఇన్‌చార్జి కన్వీనర్ బుర్ర శేఖర్, ఈదుల బిక్షంరెడ్డి, ఎరుకలి నిరంజన్, జక్కులి అంజయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధిష్ఠానం హామీని అమలుచేయాలి

● డీసీసీ ఉపాధ్యక్షుడు మేకల జగన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల జగన్‌రెడ్డి

మర్రిగూడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మంత్రి పదవి ఇస్తానన్న హామీకి కట్టుబడి ఉండాలని డీసీసీ ఉపాధ్యక్షుడు మేకల జగన్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటులో రాజగోపాల్ రెడ్డి కీలక భూమిక పోషించారని అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం రాజగోపాల్‌రెడ్డిని పిలిచి పార్టీలో చేరాలని గెలిచిన అనంతరం మంత్రి పదవి ఇస్తానని ఇచ్చిన హామీ వాస్తవమేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా వెల్లడించారని అన్నారు. అధిష్ఠానం ఇచ్చిన హామీకి కట్టుబడి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే ఈ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరాందాస్ శ్రీనివాస్. మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, శివన్నగూడ నీలకంటి రామస్వామి, చైర్మన్ రాపోలు యాదగిరి, రాష్ట్ర ఆదివాసీ కమిటీ సభ్యులు రమావత్ శ్రీనివాస్‌నాయక్, ఏర్పుల శ్రీశైలం, జంగయ్య, బంగారం రవి, గ్యార వెంకట్, సిరిపంగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సయ్యద్ హాషం

నల్లగొండరూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల చట్టం బిల్లును ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాషం డిమాండ్ చేశారు. పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలని సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హాషం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తెలంగాణలో కులగణన చేపట్టి 56 శాతం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని అన్నారు. పార్లమెంటులో ఆమోదింపజేసి చట్టం చేయడంలో బీజేపీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. బీజేపీ తన ద్వంద్వ వైఖరి మానుకుని ఇప్పటికైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పార్లమెంట్లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఏకపక్షంగా బీసీ రిజర్వేషన్ల విషయంలో వెళ్లకుండా ప్రతిపక్ష పార్టీలన్నింటినీ కలుపుకుని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, గాదె నరసింహ, దండెంపల్లి సరోజ, అవుట రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY

నల్లగొండ

5

మంగళవారం 12 ఆగస్టు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	65,800	76,252
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.38 (4.04)	5070.56	4375.6
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.963 (42.6707)	76,373	1,12,536

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు	లైవ్ : రూ.125	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.220

నులి పురుగుల నివారణ అందరి బాధ్యత

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండటౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణ అందరి బాధ్యత అని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాకేంద్రంలోని దేవరకొండ రోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉంటే ఎదుగుదల ఆగి, రక్తహీనతతో పాటు, కడుపునొప్పి బాధపడి మానసిక వైకల్యానికి గురవుతారన్నారు. జిల్లాలో 19 ఏళ్లలోపు పిల్లలందరికీ నూటికి నూరుశాతం అల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. గతంలో ప్రభుత్వం సంవత్సరానికి రెండుసార్లు ఈ మాత్రలను వేసేదని, ఇప్పుడు సంవత్సరంలో ఒకసారి మాత్రమే వేస్తున్నందున, తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వే ణుగోపాల్, డీఈవో భిక్షపతి పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలను, తప్పనిసరిగా తనిఖీ చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత మండల ప్రత్యేక అధికారులపై ఉందన్నారు. కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన హర్ ఘర్ తిరంగా వాల్‌పోస్టర్‌ను జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, ఆర్డీవోలురమణారెడ్డి, శ్రీదేవి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

అసమ్మతి గళంతో.. కాంగ్రెస్‌లో దుమారం



- మంత్రి పదవిపై అధిష్ఠానం హామీ ఇచ్చిందన్న డిప్యూటీ సీఎం
- రాజగోపాల్‌రెడ్డిని విమర్శిస్తూ తెరమీదకు చల్లమల్ల కృష్ణారెడ్డి
- చల్లమల్లకు కాంగ్రెస్‌కు సంబంధం లేదని ప్రకటించిన యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు
- ఆసక్తికరంగా మారుతోన్న రాజకీయం

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అసమ్మతి గళం కాంగ్రెస్‌లో దుమారం రేపుతోంది. రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవి విషయంలో రోజుకో ఘటన తెరమీదకు వస్తోంది. తాజాగా ఈ నెల 10వ తేదీన ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క రాజగోపాల్‌రెడ్డి వాదనకు బలం చేకూర్చేలా వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వాస్తవాలు చెప్పినందుకు ఆయనకు ధన్యవాదాలు అంటూ రాజగోపాల్‌రెడ్డి ఎక్స్ (ట్విటర్)లో ట్వీట్ చేయడంతో కాంగ్రెస్‌లో, రాజకీయపార్టీల్లో చర్చ మొదలైంది. మరోవైపు సోమవారం చల్లమల్ల కృష్ణారెడ్డి రాజగోపాల్‌రెడ్డిని విమర్శిస్తూ నల్లగొండ జిల్లా మర్రిగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడితే, ఆయనకు కాంగ్రెస్‌తో సంబంధమే లేదని యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఖండించగా, సంస్థాన్‌నారాయణపురం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చల్లమల్లపై ఫైర్ అయ్యారు.

మంత్రి పదవి హామీ వాస్తవమే..

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో అధిష్ఠా నవర్గం ఆయనకు రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా అవకాశం కల్పిస్తామని మాట ఇచ్చిన మా ట వాస్తవమని, ఆరోజు తాను ఆ సమావేశంలో ఉన్నానని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీన ఒక టీవీఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని బహిరంగపరిచారు. కేబినెట్ కూర్పు సమీకరణాల్లో ఆయనకు అవకాశం కల్పించలేకపోయామని భట్టి వివరించారు. భట్టి వ్యాఖ్యల నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డి తాజాగా సోమవారం ఎక్స్‌వేదికగా భట్టి వ్యాఖ్యల కు ధన్యవాదాలు తెలుపుతూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తను ట్యాగ్ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనకు మంత్రి పదవి ఇస్తామన్న హామీని అమలు చేయకుం డా రాష్ట్ర ముఖ్యనేతలు అడ్డుకుంటూ, అవమానిస్తున్న వాస్తవాన్ని మీడియా ద్వారా ప్రజలకు వివరించినందుకు డిప్యూటీ సీఎంకు ధన్యవాదాలని పేర్కొన్నారు.



మంత్రి పదవి ముఖ్యం కాదని..

రాజగోపాల్‌రెడ్డి మరోసారి తనకు మంత్రి పదవి ముఖ్యంకాదని, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, అవినీతిరహిత పాలన అందించాలని కోరారు. తెలంగాణ సమాజ ఆకాంక్షలు నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి రాకుండా రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు అడ్డుకుంటూ, అవమానిస్తున్నారని ఈ సందర్భంగా రాజగోపాల్ ప్రస్తావించారు. ఇప్పటికే ఆయన సీఎం రేవంత్‌రెడ్డి సోషల్ మీడియా, డిజిటల్ మీడియాపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పోస్ట్ చేయడంతో పాటుగా, గతంలో చౌటుప్పల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకునేలా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నేతలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతూ లేఖరాయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా తనకంటే జూనియర్లకు, పార్టీలో కొత్తగా చేరిన వారికి మంత్రిపదవులిస్తున్నారంటూ విమర్శలు సైతం గుప్పించారు.

కాంగ్రెస్ నేతలపై తరుచూ విమర్శలు

ఇటీవల తరచూ ఆయన సీఎంపైనా, కాంగ్రెస్ నేతలపైనా నేరుగా విమర్శలకు దిగుతున్నారు. తనకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంతోపాటు, పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా రాజగోపాల్‌రెడ్డి గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా డిప్యూటీ సీఎం సైతం రాజగోపాల్ వాదనను బలపరిచేలా వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్‌లో రాజగోపాల్ వాదనకు బలం చేకూరినట్లైందని ఆయన వర్గీయులు చెబుతున్నారు. రాజగోపాల్‌రెడ్డి సోదరుడు మంత్రి వెంకటరెడ్డి మాత్రం ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి విషయమై విలేకరులు ప్రశ్నించగా, అది తన పరిధిలోని అంశం కాదని, ఆవిషయమై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని.

- మిగతా 7వ పేజీలో...



7

ఆర్టీసీకి రాఖీ ధమాకా

- మూడు రోజుల్లో రూ.6.56కోట్ల ఆదాయం

అన్నాచెల్లెళ్ల పండుగ రాఖీ.. ఆర్టీసీకి కలిసొచ్చింది. అత్తగారింటి వద్ద ఉన్న ఆడపడుచులు తల్లిగారింటికి రావడంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి. దీంతో ప్రత్యేక సర్వీసులను సైతం నడిపిన ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. మూడు రోజుల్లో రూ.6.56 కోట్లు వచ్చింది. ఇది ఆర్టీసీ చరిత్రలోనే ఓ రికార్డు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

గోదాములు ఖాళీల్లేవ్

- సీఎంఆర్ బియ్యం నిల్వ చేసేందుకు చోటు కరువు
- ఎఫ్‌సీఐకి కేటాయించిన 2.46 లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం గోదాముల్లోనే నిల్వ
- ఎఫ్‌సీఐ నుంచి ఆర్డర్లు, రైల్వే నుంచి వ్యాగన్ల కేటాయింపుల్లో జాప్యం

నల్లగొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మిల్లుల్లో బియ్యం నిల్వలు పేరుకపోవడంతో మిల్లింగ్ ఆపాల్సి వస్తోంది. గోదాములు, మిల్లుల్లో బియ్యం నిల్వలు సామర్థ్యానికి మించి నిండిపోయాయి. ఎఫ్‌సీఐకి లెవీ కింద కేటాయించిన బియ్యాన్ని తరలించేందుకు అవసరమైన రైల్వే వ్యాగన్లు అందుబాటులో లేకపోవడంతో ఎక్కడి బియ్యం అక్కడే ఆగిపోయాయి. దీంతో మిల్లుల్లో బియ్యం మరాడించలేక సామర్థ్యాన్ని తగ్గించుకోవడం, లేదంటే మిల్లింగ్ ఆపేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎఫ్‌సీఐతో సమన్వయం చేసుకొని బియ్యం నిల్వలు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, లేదంటే బియ్యం నిల్వలకు ప్రత్యామ్నాయాన్నైనా వెతకాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు నల్లగొండ జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం నాయకులు కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు తమ సమస్యలు విన్నవించడంతో గోదాములు నిండిన విషయం చర్చకు వచ్చింది.

ఎఫ్‌సీఐ నుంచి ఆర్డర్లు, రైల్వే నుంచి ర్యాక్స్..

జిల్లాలో ఉన్న గోదాములలో ఇప్పటికే ధాన్యం పూర్తిగా నిండిపోవడంతో మిల్లుల నుంచి వచ్చే సీఎంఆర్ కోటా బియ్యం నిల్వ చేసేందుకు గోదాములు అందుబాటులో లేవు. జిల్లాలో గత నాలుగైదు సీజన్లుగా యాసంగిలోనూ దొడ్డురకం ధాన్యం భారీగా దిగుబడి వస్తుండడం, ఆ ధాన్యమంతా ప్రభుత్వమే కొనుగోలు చేసి సీఎంఆర్ ద్వారా బియ్యంగా మార్చి తిరిగి ఎఫ్‌సీఐకి లెవీ కింద కేటాయిస్తుంది. ఎఫ్‌సీఐ నుంచి ఆర్డర్లు తీసుకోవడం, తీసుకున్న ఆర్డర్ ప్రకారం బియ్యాన్ని పంపేందుకు అవసరమైన రైల్వే ర్యాకులు తెప్పించడంలో సివిల్ సప్లయిస్ సంస్థ, కేంద్ర ఎఫ్‌సీఐ సంస్థల మధ్య సమన్వయ లోపంతో జిల్లాలో బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. అందుబాటులో ఉన్నసమాచారం మేరకు జిల్లాలో 31 గోదాముల్లో 5,35,235 మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యముండగా, వాటిల్లో దాదాపు వందశాతం సామర్థ్యం మేర నిల్వలు పేరుకుపోయాయని తెలుస్తోంది. దీంతో మిల్లులకు ఈ రబీ సీజన్‌లో కేటాయించిన ధాన్యం నుంచి ఉత్పత్తయ్యే బియ్యం తరలించడానికి గోదాముల్లో ఖాళీ లేదు. దీంతో మిల్లుల్లో సైతం ఎక్కడికక్కడ బియ్యం నిల్వలు పేరుకపోవడంతో జిల్లావ్యాప్తంగా పలు రైస్‌మిల్లుల్లో మిల్లింగ్ సామర్థ్యం తగ్గించి పనిచేయిస్తుంటే, మరికొన్ని మిల్లుల్లో మిల్లింగ్‌ను పూర్తిగా నిలిపివేశామని మిల్లర్లు పేర్కొంటున్నారు.



మిర్యాలగూడ సమీపంలో ఓ రైస్‌మిల్ వద్ద ధాన్యం నిల్వలు

జిల్లాలోని కొనుగోలు కేంద్రాల ద్వారా..

ఈ రబీ సీజన్‌లో జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా 5,79,868 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సీఎంఆర్ నిమిత్తం మిల్లులకు కేటాయించారు. ఇందుకు 3,33,602 మెట్రిక్‌టన్నుల బియ్యం రావాల్సి ఉండగా, ఇందులో 2,62,961 మెట్రిక్‌టన్నుల బియ్యం సిద్ధంగా ఉందని, ఇంకా 70,639 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లుల నుంచి రావాల్సి ఉంది. దీంతో గోదాములు పూర్తి నిల్వ సామర్థ్యానికి...

- మిగతా 8వ పేజీలో...

నేర నియంత్రణకు సిద్ధంగా ఉండాలి

- ఎస్పీ శరత్ చంద్రపవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణలో భాగంగా మహిళా పోలీస్ సిబ్బంది అన్ని విధులు నిర్వర్తించడానికి సిద్ధంగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న మహిళా పోలీస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వారు చేస్తున్న డ్యూటీ, ఎదురయ్యే సమస్యలు, పురుష సిబ్బందితో సమానంగా విధులు నిర్వర్తిస్తే ఎదురయ్యే సమస్యలు, కుటుంబ తరఫున సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 'షీ లీడ్స్-నల్లగొండ బిలీవ్స్' అనే నినాదంతో నూతన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా సిబ్బంది పోలీస్‌స్టేషన్లలో రిసెప్షన్, రికార్డు వర్క్స్, కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రాం, నైట్ పెట్రోలింగ్, పిటిషన్ ఎంక్వయిరీ, కోర్టు డ్యూటీ, బందోబస్త్ డ్యూటీలు పురుషులతో సమానంగా విధులు నిర్వర్తించాలన్నారు. మహిళా సిబ్బందికి సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ రమేష్, ఎస్‌బీ సీఐ రాము, డబ్ల్యూపీఎస్ సీఐ కరుణాకర్, ఆర్ఐ సంతోష్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదుల పరిశీలన

జిల్లాపోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ శరత్ చంద్రపవార్ పరిశీలించారు. వివిధ ప్రాంతాలనుంచి 52 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేయాలన్నారు. పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.


జిల్లాలో కురిసిన వర్షం

నల్లగొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారంరాత్రి పలు మండలాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై, మధ్యాహ్నం, సాయంత్రంవేళ వానపడింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు వర్షం నీటితో జలమయమయ్యాయి. వరి పొలాలు నీట మునిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గుడిపల్లిలో అత్యధికంగా 67.8మి.మీలు, అత్యల్పంగా నల్లగొండ పట్టణంలో 16.3మి.మీల వర్షం కురిసింది.



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో కురుస్తున్న వాన

విద్యార్థుల అభ్యసనంపై దృష్టి సారించాలి



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

- ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు హాజరు నమోదు తప్పనిసరి
- టీచర్లు తప్పనిసరిగా డైరీ రాయాలి
- చిట్యాల మండ ం వట్టిమర్తిలో పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో బొల్లారం భిక్షపతి

చిట్యాల రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను విద్యార్థులు తప్పనిసరిగా అభ్యసించాలని, విద్యార్థుల అభ్యసనంపై ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను సోమవారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు నమోదు పరిశీలించి, దాని గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని నమోదులో ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులందరూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌ను (టచ్ స్ర్కీన్) ఉపయోగించి పాఠ్యాంశాలు బోధించాలని, విద్యార్థుల హాజరుశాతం పెంపుపై, ఉపాధ్యాయుల డైరీ, విద్యార్థుల వర్క్‌బుక్‌ల పరిశీలన, వారి అభ్యసన సామర్థ్యంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, పాఠశాలకు విద్యార్థులు నిత్యం హాజరయ్యేలా కృషిచేయాలని, అంతేకాకుండా హాజరుశాతం కూడా పెరిగే విధంగా చూడాలన్నారు. తరగతి గదుల్లో విద్యార్థుల అభ్యసనాభివృద్ధిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, అభ్యసనా సామర్థ్యం విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. పాఠ్యాంశాల బోధన అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో అభ్యసనం చేయించాలని, తద్వారా విద్యార్థులు పాఠ్యాంశాలను అవలీలగా అవగతం చేసుకోవడమే కాకుండా, వారి అభ్యసనా సామర్థ్యం పెరుగుతుందన్నారు. పాఠశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు తప్పనిసరిగా ముఖ గుర్తింపు హాజరును నమోదు చేసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే సమచారం ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులందరూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌ను వినియోగించి బోధనాభ్యాసన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులందరూ తప్పసరిగా డైరీని రాయాలని, ఆ డైరీ అందరికీ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం పెట్టాలని, నాణ్యతగా, రుచికంగా, పరిశుభ్రంగా వంటలు చేయాలన్నారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయులు పందిరి రమేష్, సరస్వతి, ఉపాధ్యాయులు యాదయ్య, ఆనంద్, నర్సింహ తదితరులు ఉన్నారు.

వరదొచ్చిందంటే గుండెల్లో దడ

- భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తోన్న మూసీ

వానాకాలం వచ్చిందంటే చాలు మూసీ పరివాహక ప్రాంతాల ప్రజల గుండెల్లో దడ మొదలవుతుంది. హైదరాబాద్‌నగరంతోపాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసిన పక్షంలో... రాత్రికి రాత్రే మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. వరద ఉధృతి పెరిగినప్పడల్లా యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు మండలాలకు రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. ఉదయం లేచి వేరే గ్రామానికి వెళ్దామంటే మూసీ ప్రమాదకరంగా పారుతూ కన్పిస్తుంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

ఎగువన కురిసిన వర్షాలకు మూసీ వాగులు పొంగిపొర్లుతున్నాయి.చౌటుప్పల్ మండలం నేలపట్ల వద్ద ఈనెల 8వ తేదీన ఉధృతంగా ప్రవహి స్తున్న మూసీ కాలువపై నుంచి కారు వెళ్లలేక చిక్కుకుంది. ఈకారులో ఇద్దరు చిన్నారులతోపాటు ఏడుగురు వ్యక్తులు ఉన్నారు. వారు వెంటనే అప్రమత్తమై 100కు డయల్ చేయడంతో పోలీసు లు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకొని తాడు సహాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు. ఈ నెల నాలుగో తేదీన వలిగొండ మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన నలుగురు పశువుల కాపరులు మూసీ వాగులో చిక్కుకున్నారు. వీరు కూడా 100కు డయల్ చేయడంతో వెంటనే రెస్క్యూ టీం సహాయక చర్యలు చేపట్టి..., వీరిని బయటకు తీసుకొచ్చిన విషయం విదితమే.



వలిగొండ మండలం సంగెం-బొల్లెపల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న మూసీ

ప్రమాదకరంగా ప్రయాణం

వ్యవసాయ పనులు చేసేవారితోపాటు పశువుల కాపరులు నిత్యం ప్ర మాదాల బారిన పడుతున్నారు. యాదాద్రి భు వనగిరి జిల్లాలోని బీబీనగర్ మండలం రుద్రవెల్లి-జూలూరు లోలెవల్ బ్రిడ్జీ మీదుగా భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్ మండలాలకు వెళ్లే పరిస్థితి ఉండదు. అదేవిధంగా వలిగొండ మండలం సంగెం-బొల్లెపల్లి బీమలింగం కత్వ మీదుగా భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాలకు దారులు మూసుకుపోతాయి. హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లి-జూలూరు బ్రిడ్జీ నిర్మాణానికి మోక్షం లభించడంలేదు. 2016లో ప్రస్తు తం ఉన్న లోలెవల్ బ్రిడ్జీ పక్కనుంచి హైలెవల్ బ్రిడ్జిని నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం చర్య లు తీసుకుంది. ఈ బ్రిడ్జీ నిర్మాణానికి అంచనా లు రూపొందించి..., మొదటగా రూ.5.05కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 20మంది రైతు ల వద్ద 2.04ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించడమే కాకుండా., కొన్ని పిల్లర్ల వరకు అసంపూర్తిగా నిర్మాణాలు చేపట్టింది. ఏడు సంవత్సరాలుగా పిల్లర్ల స్థాయిలోనే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వం మరోసారి అదనంగా మరో రూ.10.80కోట్లు మంజూరు చేసింది. అయితే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందకు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూసీ ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

ముఖ్యమంత్రి చొరవతో..

ముఖ్యమంతి ఎనుముల రేవంత్‌రెడ్డి గత సంవత్సరం నవంబరులో వలిగొండ మండలం సంగెం బ్రిడ్జీ వద్ద చేపట్టిన మూసీ పునరుజ్జీవం పాదయాత్ర చేపట్టారు. స్థానిక ప్రజలు మూసీ కాలుష్యంతో పడుతున్న ఇబ్బందులను, మూసీ ప్రక్షాళన అవశ్యకతను వివరించారు. మూసీ ప్రక్షాళన ఒక సంకల్పంతో చేపట్టామని, ఎవరు అడ్డుపడ్డా చేస్తామని ప్రకటించారు. నూతనంగా ఫ్లైఓవర్ బ్రిడ్జీలు నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విన్నవించారు. దీనిపై సీఎం స్పందిస్తూ ఈ ప్రాంతంలో నిర్మించాల్సిన బ్రిడ్జీలపై పూర్తిస్థాయి నివేదికను అందించాలని, వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

రేపటి లోగా వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై అందించే వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు రైతులకు సద్వినియోగం చేసుకోవాలని ఏవో శివరాంకుమార్ సోమవారం తెలిపారు. ఎస్ఎంఏఎం పథకం కింద యాంత్రీకరణ ఎరికరాలు ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50శాతం సబ్సిడీతో ఇతరులకు 40శాతం సబ్సిడీతో మంజూరు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు ఈనెల 14వ తేదీ లోపు ఏఈఓలకు దరఖాస్తులను అందించాలన్నారు.

ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి

దేవరకొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ 90వ వార్షిక వేడుకలు నేటి నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు తెలిపారు.స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో సోమవారం నిర్వహించిన సంఘం నియోజకవర్గ సమావేశంలోఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై విద్యార్థులపక్షాన ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో శివకుమార్, సాయి, దానరి శివ, వినయ్, మధు, అరవింద్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత

దేవరకొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని దేవరకొండ మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవరకొండ మునిసిఫ్ కోర్టులో నిర్వహించిన క్యారమ్స్, చెస్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమ మహేశ్వర్, ఏజీపీ.నెమికంటి రమాశంకర్, సీనియర్ న్యాయవాదులు గాజుల అంజనేయులు, లోహిత్‌రెడ్డి, శ్రీనివాసులు, వనం జగదీశ్వర్, పుష్పలత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సక్రమంగా వేతనాలు అందించాలి

దామరచర్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగ్గు మిల్లుల యజమాన్యాలు కార్మికులకు సక్రమంగా వేతనాలు అందించాలని సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో దాదాపుగా 80 ముగ్గు మిల్లులు ఉండగా వెయ్యి మంది వరకు కార్మికులు పనిస్తున్నారని, యాజమాన్యాలు కార్మికులకు సక్రమంగా వేతనాలను అందించడం లేదని, వారికి కనీస సౌకర్యాలు బెల్లం, చెప్పులు, మాస్కులు, డ్రెస్‌లు అందించడం లేదన్నారు. వెంటనే కార్మికులకు సక్రమంగా వేతనాలు అందించాలని లేనట్లయితే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వినోద్, ఎర్రనాయక్, పాపానాయక్, నీలాబాయి, నాగులు, రాందాస్, రవి, సైదా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచేందుకే జెర్సీల పంపిణీ



జెర్సీ దాత శీలం నారాయణరెడ్డితో ఎంఈవో శ్రీనయ్య,విద్యార్థులు

పెద్దఅడిశర్లపల్లి,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకే జెర్సీలు పంపిణీ చేసినట్లు రిటైర్డ్ పీఈటీ శీలం నారాయణరెడ్డి అన్నారు. గుడిపల్లి మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 110 మంది విద్యార్థులకు రూ.45 వేల విలువ చేసే స్పోర్ట్స్ డ్రెస్‌ను గుడిపల్లి ఎంఈవో సముద్రాల శ్రీనయ్యతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం సముద్రాల శ్రీనయ్య, ఉపాధ్యాయులు దాత శీలం నారాయణరెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శీలం విజయశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శీలం శేఖర్‌రెడ్డి, బోయ సుధాకర్‌రెడ్డి, కొమ్ము బక్కమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిగ్ హెల్ ఆధ్వర్యంలో ట్యాంకు ఏర్పాటు

నాగార్జునసాగర్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సాగర్ పైలాన్ కాలనీలో వేమూరి అబిరామేశ్వర్‌రావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగు నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. సోమవారం ఈ ట్యాంకును దాతలు కృష్ణవేణి, సూర్యప్రకాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషు, బిగ్ హెల్ప్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజబాబు, భాస్కర్‌బాబు, ప్రతినిధులు అంజయ్య, కుర్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సలీం

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఓటు చోరీపై విస్తృత ప్రచారం చేయాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ. సలీం, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్ పిలుపునిచ్చారు. సోమవారం రాజీవ్‌భవన్‌లో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఓట్ల అక్రమ తరలింపును అడ్డుకునేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతు పలకాలన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎస్ఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఎన్నిక తరహాలోనే ఓటు చోరీ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, సులభతరమైన విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. సమావేశంలో హరిప్రసాద్, సయ్యద్, భాస్కర్, వాలంటైన్, బాబా పాల్గొన్నారు.

ఏజెన్సీల్లో వైద్య సేవలపై అధ్యయనం చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- నందికొండ మునిసిపాలిటీలో సమీక్ష సమావేశం



నందికొండ మునిసిపాలిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాగార్జునసాగర్,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి):ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. నందికొండ మునిసిపల్ కార్యాలయంలో సోమవారం సంబంధిత అధికారులు, నైస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠీ మాట్లాడుతూ జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పరంగా అవసరమైన వైద్యసేవలు కల్పిస్తున్నప్పటికీ ఇంకా కొన్ని చోట్ల కొన్ని రకాల సేవల్లో ఇబ్బందులు ఉండవచ్చునన్నారు. అలాంటి సమస్యలను గుర్తించి ఆ విభాగంలో పనిచేసేందుకు నైస్ సంస్థ ముందుకు రావాలని ఆమె కోరారు. గిరిజనుల ఆరోగ్యానికి సంబంధించిన లోపాలను గుర్తించేందుకు నైస్ స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం సంతోషమని తెలిపారు. సంస్థ తమ సేవలు అందించేందుకు ముందుగా చందంపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని అక్కడ సమస్యలను అధ్యయనం చేసి నివేదికలు సమర్పించాలని ఆమె కోరారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాఖీ మాట్లాడుతూ 5 రాష్ట్రాల్లో తాము గిరిజనుల ఆరోగ్యానికి పనిచేసిన అనుభవాలను వివరించారు. చెంచులు, గిరిజనతండాల్లో మౌలిక సదుపాయాల లేమితో వివిధ రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు.చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు సరైన వైద్యసేవలతో పాటు ఇతర సౌకర్యాల కల్పించడానికి సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. కాగా దేవరకొండ, మిర్యాలగూడ ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. డీటీడీవో చత్రునాయక్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్‌ను సమన్వయ అధికారులుగా నియమిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, పీడీ రాజ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రవి, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, రిచ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రష్మీ, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, నందికొండ మునిసిపల్ కమిసనర్ గురులింగం, ఉన్నారు.

కాన్పుల సంఖ్యను పెంచాలి

నాగార్జునసాగర్ హిల్‌కాలనీ కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం సాయంత్రం ఆమె ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, రిజిస్టర్‌లను, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పరిశీలించారు. అనంతరం జనరల్ వార్డు, చిన్న పిల్లల, మేల్, ఫిమేల్ వార్డులను పరిశీలించారు.

రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. వానాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశిం చారు. అనంతరం నర్సింగ్ కళాశాల ఏర్పాటుపై నివేదిక అందజేయాలని సీఎంవోను ఆదేశించారు. ఆమె వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, డీసీహెచ్‌వో డాక్టర్ మాతృనాయక్, ఆసుపత్రి సీఎంవో డాక్టర్ భానుప్రసాద్ నాయక్ డాక్టర్ పృథ్వీ ఉన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమిని కేటాయించాలి

నేరేడుగొమ్ము, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమునిగల్‌లోని గిరిజనుల ఆరాధ్యదైవంగా భావించే ఆంజనేయస్వామి, గురుద్వార్, గురునానక్, భవాని ఆలయాలకు 10 ఎకరాల భూమిని కేటాయించాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయ అధికారికి చిన్నమునిగల్ గ్రామస్థులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చె ందిన సోమ్లానాయక్, మంగ్లానాయక్, వెంకట్‌లాల్, జగన్‌నాయక్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా సర్వే నెంబర్ 169లో ఆలయాలను ఏర్పాటు చేసుకొని పూజలు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు భూమి కేటాయించాలని కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):విశ్రాంత ఉపాధ్యాయుడు అక్కి మోహన్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి ఉపాధ్యాయ సంఘ నేతలు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో బాలాజీనాయక్ మాట్లాడుతూ మోహన్ విద్యాసేవలందించడంతో పాటు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని గుర్తు చేశారు. అనంతరం మోహన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో చాపల శ్రీనివాస్, అంబటి శ్రీనివాస్, మాలి సైదులు, వీరనారాయణ, పరమేష్, మధుకుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ చార్జీలు వెంటనే తగ్గించాలి



బస్టాండు ప్రవేశ ద్వారం వద్ద ధర్నా చేస్తున్న సేవాలాల్ సేన నాయకులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సేవాలాల్ సేన ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం, రాఖీ పండుగల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామంటూ ఆర్టీసీ అధికారులు 40 నుంచి 50శాతం చార్జీలు పెంచారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి 'పెరిగిన బస్ టికెట్ ధరలు' అంటూ కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన సేవాలాల్ సేన సభ్యుడు పెంచిన చార్జీలు తగ్గించాలని కోరుతూ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట బైఠాయించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సేన జిల్లా అధ్యక్షుడు ధనవత్ ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ లాభార్జనే లక్ష్యంగా పెట్టుకున్న ఆర్టీసీ యాజమాన్యం పండుగుల సమయంలో చార్జీలు పెంచుతుందన్నారు.' ఎంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని, సాధారణ టికెట్ ధరలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌నాయక్, అనీల్‌నాయక్, హరీష్, చంద్రు, దినేష్, రాందాస్, బాబునాయక్ పాల్గొన్నారు.

చేనేతల సమస్యలపై ఉద్యమించాలి : ఎమ్మెల్సీ



మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

చింతపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు సమస్యల సాధన కోసం ఉద్యమించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు. మండలంలోని వేంకటేశ్వరనగర్‌లో సోమవారం సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభకు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి చేనేత కార్మికుడికి భరోసా పథకం కింద రూ. 24 వేలు అందించాలని కోరారు. ప్రతి కార్మికుడి వివరాలు పొందుపరిచి జియోట్యాగ్ వేయాలన్నారు. రాష్ట్ర సాధనలో ఎంతోమంది చేనేత కార్మికుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు మాట్లాడుతూ కార్మికులు కష్టపడి తయారు చేసిన వస్త్రాలను కొనుగోలు చేసుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్మికులు ఎమ్మెల్సీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకటరాములు, చేనేత కార్యవర్గ సభ్యుడు చేపూరి ధనుంజయ్య, సభాధ్యక్షుడు చేపూరి వెంకటయ్య, సంబారి శ్రీనివాస్, రావిరాల శ్రీనివాస్, కర్నాటి గణేష్, జ్యోతి బస్, గుర్రం చంద్రమౌళి, మన్న దామోదర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



కొండమల్లేపల్లి జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి

కొండమల్లేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉషారాణి ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ఎస్సీ బాలికల విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్‌రావు నాయక్, సీహెచ్‌వో సుగుణాబాయి, రసూల్, హెల్త్‌అసిస్టెంట్ లలిత, రవి, బ్లెస్సి, ఆశ కార్యకర్తలు సైదమ్మ, యా దయ్య, ధనమ్మ లక్ష్మి, సుజాత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సయ్యద్ అజహర్ అహ్మద్, రామాంజనేయులు మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో మాత్రలను మింగించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో షాహెద్, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఆశలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● చింతపల్లి : వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చింతపల్లి, వీటీనగర్ జడ్పీహెచ్‌ఎస్ లోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యాధికారి శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాల్ పాత బస్టాండ్ సమీపంలో బస్సులు నిలపాలి

చింతపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరనగర్(మాల్) పాత బస్టాండ్ సమీపంలో ఆర్టీసీ బస్సులు నిలపాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం.మజహర్‌అలీబేగ్(పాషా), కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ మేరకు బస్సులు నిలపకపోవడంతో పట్టణవాసులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీంతో ఎమ్మెల్యే ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి బస్సులు నిలపడానికి ఆదేశాలు జారీ చేయాలని సూచించారు.

బీమారం-సూర్యాపేట రోడ్డును పూర్తి చేయాలి



గుంతలో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

వేములపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బీమారం- సూర్యాపేట రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శెట్టిపాలెం గ్రామ శివారులోని బీమారం-సూర్యాపేట రహదారిపై అసంపూర్తిగా వదిలేయడంతో భారీ గుంతల వద్ద ఆయన నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రోడ్డు పనులను ప్రారంభించి 15 ఏళ్లు కావొస్తున్నప్పటికీ అధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోడ్డు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయన్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోకపోతే ఈ నెల 17న సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో లింగయ్య, వెంకటరమణ, శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

షీ టీమ్స్ సేవలపై అవగాహన ఉండాలి



షీటీమ్స్ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తబితారాణి

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): షీ టీమ్స్ సేవలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని షీటీమ్ ఎస్ఐ తబితారాణి అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్‌డీజే పాఠశాల విద్యార్థులకు సోమవారం షీ టీమ్ పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు షీ టీమ్ పనిచేస్తుందన్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు నిర్భయంగా విద్యార్థినులు 100కు ఫోన్‌చేసి షీటీం సేవలు పొందవచ్చన్నారు. అదేవిధంగా వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, మెయిల్ వంటి సోషల్ మీడియా ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, అందుకు అనుసరించాల్సిన ఈ-మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్లను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి స్నేహలత, ప్రిన్సిపాల్ జానీ పాల్గొన్నారు.

గోదాములు ఖాళీ ల్లేవ్

(5వ పేజీ తరువాయి)

నిండిపోవడంతోపాటు, మిల్లుల్లోనూ సన్నబియ్యంకు సంబంధించి, గత వానాకాలం సీజన్ బియ్యం సైతం నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో తక్షణమే గోదాముల్లో ఉన్న బియ్యంలో ఎఫ్‌సీఐకి పంపాల్సిన 2,46,267 మెట్రిక్‌టన్నుల బియ్యానికి అనుమతులు తీసుకోవడంతోపాటు, రవాణాకు...సంబంధించిన రైల్వే ర్యాకులు వచ్చేందుకు రాష్ట్ర సివిల్‌సప్లయ్ సంస్థ చొరవతీసుకోవాలని, లేదంటే మిల్లులు నడిపే పరిస్థితి లేదని మిల్లర్లు చెబుతున్నారు. ఈమేరకు గోదాముల్లో బియ్యం తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ ఇలాత్రిపాఠికి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు జిల్లా మిల్లర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్నాటి నారాయణ, రేపాల భద్రాద్రి, కార్యవర్గసభ్యుడు జె.ఇంద్రారెడ్డి తదితరులు వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు పేర్కొన్న అంశంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎఫ్‌సీఐకి బియ్యం తరలించేందుకు, రైల్వే వ్యాగన్ల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని వారికి కలెక్టర్ హామీ ఇచ్చారు.

దాతల సహకారం మరువలేనిది

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం మరువలేనిదని మండల విద్యాధికారి లావూరి బాలు అన్నారు. మండలంలోని లావూడితండాలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో లావూడితండా ఉద్యోగుల సంఘం సహకారంతో పాఠశాల భవనానికి రంగులు వేయించడమే కాకుండా విద్యార్థులకు టై, బెల్టులను, బూట్లను, ఐడీకార్డులను అందించారు. కార్యక్రమంలోఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగన్‌నాయక్ అడవిదేవులపల్లి మండల విద్యాధికారి వరలక్ష్మి, డాక్టర్ లావూడి బాలాజీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గౌరికుంటతండాను ముంచెత్తిన వరద



గౌరికుంటతండాలో ఓ ఇంటిలోకి చేరిన వరద



వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి,తహసీల్దార్ నరేందర్

కొండమల్లేపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో మండలంలోని నల్లగొండ రోడ్డులోని గౌరి కుంటతండా వరద నీటిలో చిక్కుకుంది. భారీ వర్షంతో తండాలోని ఇళ్లన్నీ జలమయయ్యాయి. తండాపై పక్కన ఉన్న అబ్బనబోయినగూడెం ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద తండాను ముంచెత్తింది. దీంతో తండాలోని సుమారు 15 ఇళ్లు జలమయయ్యాయి. అబ్బనబోయినగూడెం సమీపంలో నిర్మించిన ఓ కట్టడం ఎత్తు పెంచుకొని వరద కట్టపోయడంతో నల్లకుంటకు వెళ్లాల్సిన వర్షపు నీరు మొత్తం కూడా తండాకు చేరాయి. దీంతో ఇళ్లలోకి వరద చేరి నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. దీంతో విష కీటకాలతో ప్రమా దం పొంచి ఉందని తండావాసులు బిక్కుబిక్కుమంటున్నారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ నరేందర్, రెవెన్యూ సిబ్బంది తండాను సందర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వరద ముంపు నివారణ చర్యలు తీసుకుంటామని ఆర్డీవో గ్రామస్తులతో పేర్కొన్నారు. ఎస్ఐ అజ్మీరా రమేష్ తదితరులున్నారు.

● చింతపల్లి : మండలంలోని సాయిరెడ్డి గూడెం నుంచి మోద్గులమల్లేపల్లికి వెళ్లే దారిలో బ్రిడ్జి లేకపోవడంతో కురుస్తున్న వర్షాలకు వాన నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సినిమా గైడ్: మిర్యాలగూడ: శ్రీనివాస : అతడు /జూనియర్, వెంకటేశ్వర: టు ఫ్రమ్ సో / రాఘవ: కింగ్‌డమ్, విట్రోస్: మహావతార్ నరసింహ, బకాసుర రెస్టారెంట్ దేవరకొండ: మనోజ్ : కింగ్‌డమ్ మైత్రి వెంకటేశ్వర : మహా అవతార్ నర్సింహ